ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

అన్నమయ్య
జిల్లా వార్తలు

5

శుక్రవారం 12 ఏప్రిల్ 2024



విద్యుత్ దీపాలంకరణలో పట్టాభి రామాలయం

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

● నేడు గజవాహన సేవ

వాల్మీకిపురం, ఏప్రిల్ 11: వాల్మీకిపురం పట్టణంలో వెలసిన పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలకు గురువారం టీటీడీ ఆధ్వర్యంలో అంకురార్పణ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ మండపంలో కలశ స్థాపన, హోమాది కార్యక్రమాలు పూర్తి చేశారు. అనంతరం సుదర్శన చక్రానికి పూజలు చేసి, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ బ్రహ్మోత్సవాల అంకురార్పణ కార్యక్రమాలు వైభవంగా సాగాయి. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు,ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు కృష్ణప్రసాద్, కృష్ణరాజు, భాషికాచార్యులు, రామ్‌గోపాల్ బృందం, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం ధ్వజారోహణం, స్నపనతిరుమంజనం, ఊంజల్‌సేవ, రాత్రికి గజవాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవం కార్యక్రమాలు జరగనున్నాయి.


వాల్మీకిపురంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు


పీలేరు ఈద్గాలో ఈదుల్ ఫితర్ నమాజు ఆచరిస్తున్న ముస్లింలు


రాయచోటి ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


రాజంపేట ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

● ఈద్గాలలో సామూహికంగా నమాజు చేసిన ముస్లింలు

పీలేరు, ఏప్రిల్ 11: జిల్లావ్యాప్తంగా గురువారం రంజాన్ పండుగను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉపవాసాలతో దేహ-ఆత్మ శుద్ధి, తరావీహ్ నమాజులలో ఖురాన్ శ్రవణంతో పుణ్యం, జకాత్ దానంతో సంపద శుద్ధి కల్పించిన పవిత్ర రంజాన్ మాసాన్ని తమకు ప్రసాదించినందుకు ఓ వైపు కృతజ్ఞత, అంతటి మహోన్నత మాసాన్ని తమకు మరోమారు ప్రసాదించమని వేడుకోలతో ముస్లింలు ఆనందోత్సాహాలతో ఈదుల్ ఫితర్ పండుగ సామూహిక నమాజును ఆచరించారు. గురువారం వేకువజాము నుంచే పీలేరులో కోలాహలం నెలకొంది. మతగ్రంథాల్లో నిర్దేశించిన విధంగా అత్యధికులు గురువారం వేకువజామునే పవిత్ర స్నానం ఆచరించి కొత్త బట్టలు ధరించి అత్తరు పూసుకుని మదనపల్లె మార్గంలోని ఈద్గాలో సామూహిక నమాజుకు వెళ్లేందుకు స్థానిక జెండామాను వద్దకు ఉదయం 7.45 గంటలకు చేరుకున్నారు. అక్కడి నుంచి 'అల్లాహు అక్బర్' అంటూ అల్లాహ్‌ను స్తుతిస్తూ ఈద్గాకు చేరుకున్నారు. ముందుగా నిర్దేశించినట్లుగా ఉదయం 8.30 గంటలకు ముఫ్తీ అబ్దుల్లా ఈదుల్ ఫితర్ రెండు రకాతుల పండుగ నమాజును అందరితో ఆచరింపజేశారు. నమాజు అనంతరం ఆయన ధార్మిక ఉపన్యాసం చేస్తూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులే మిన్న అని, పేదరికం, ఆకలి, చిన్నా పెద్దా తారతమ్యాలు లేని సమసమాజం కోసమే అల్లాహ్ రంజాన్ మాసాన్ని ప్రసాదించాడని, ఈ మాసంలో ఆచరించిన నియమాలను మిగిలిన మాసాల్లోనూ ఆచరించాలని ఉపదేశించారు. అల్లాహ్ ఆదేశాలు, ఆయన ప్రవక్త హజరత్ మహమ్మద్ (స.అ.సం) చూపిన బాటలో నడవాలని హితోపదేశం చేశారు. అనంతరం సామూహిక ప్రార్థన చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఇంటి బాట పట్టారు. ఈదుల్ ఫితర్ నమాజు సందర్భంగా పీలేరు-మదనపల్లె మార్గంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి, ఎస్ఐ నరసింహుడు తమ సిబ్బందితో పటిష్ట చర్యలు చేపట్టారు. సామూహిక నమాజు అనంతరం చాలామంది పట్టణంలోని ఖబరస్థాన్‌లను సందర్శించి తమ పూర్వీకుల ఆత్మశాంతి, స్వర్గలోక ప్రాప్తి కోసం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఇక అక్కడి నుంచి ప్రతి ఇంటా బిర్యానీ ఘుమఘుమలు, సేమియా సువాసనలు వెల్లువెత్తాయి. విద్య, ఉద్యోగ, ఉపాధి కోసం ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు రంజాన్ పండుగ కోసం స్వంతిళ్లకు చేరుకుని ఉండడంతో ప్రతి ఇంటా పండుగ సందడి నెలకొంది. పీలేరుతో పాటు తలపుల, రేగళ్లు, బోడుమల్లువారిపల్లె, ఆరంవారిపల్లె, శివరామాపురం గ్రామాల్లోనూ పండుగ నమాజును ఈద్గాలలో ఆచరించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

మదనపల్లెలో..: దాన ధర్మాలకు ప్రతీకగా రంజాన్ నిలుస్తుందని మతగురువు మసీద్ ఇమాం హాజరత్ జలాలుద్దీన్ తెలిపారు. రంజాన్‌ను పురస్కరించుకుని గురువారం స్థానిక బెంగళూరు రోడ్డులోని ఈద్గాలో ముస్లిం సోదరులు నమాజ్‌ను భక్తిశ్రద్ధలతో సామూహికంగా ప్రార్థనలు చేశారు. వేకువజామునే ఫజర్ నమాజ్ అనంతరం ముస్లింలు స్థానిక జామీయా మసీదుకు చేరుకున్నారు. అక్కడి నుంచి బెంగళూరు రోడ్డులోని ప్రధాన ఈద్గాకు ర్యాలీగా చేరుకుని అక్కడ నమాజ్ చేశారు. ములకలచెరువు మండలంలో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ములకలచెరువు, బురకాయలకోట, సోంపల్లె, కాలువపల్లె, దేవళచెరువు, కదిరినాథునికోట, వేపూరికోట, చౌడసముద్రం తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ములకలచెరువులో పెద్ద ఎత్తున ముస్లింలు అల్లాహ్‌ను స్మరిస్తూ ప్రార్థనలు చేశారు.

రాయచోటిలో..: రాయచోటి పట్టణంలోని పాత రాయచోటి సమీపంలో మాండవ్య నది ఒడ్డున గల ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక ప్రార్థనలు చేశారు. రమజాన్ పండుగ ప్రత్యేక ప్రార్థనల్లో రాయచోటి పట్టణానికి చెందిన వేలాది మంది మైనారిటీలు పాల్గొని ప్రార్థనల అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాజంపేటలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే ఇంటిలో నమాజ్ చేసుకుని అనంతరం ఈద్గాలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేసిన అనంతరం ఒకరినొకరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.


మదనపల్లెలో ధార్మికోపన్యాసం చేస్తున్న మసీద్ ఇమాం హాజరత్ జలాలుద్దీన్


మదనపల్లె ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

వైభవంగా బలిజపల్లె గంగమ్మ జాతర

● వేలాదిగా తరలివచ్చిన భక్తులు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 11 : రాజంపేట పట్టణం బలిజపల్లె గంగమ్మ జాతర గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలి వచ్చారు. పట్టణ సీఐ మద్దయ్య ఆచారి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. భక్తుల కోసం దాతలు చలివేంద్రాలు, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో బలిజపల్లె గంగమ్మ అమ్మవారు


జాతరలో పాల్గొన్న అశేష భక్తజనం

నేడు కోయిల్ ఆల్వార్ తిరుమంజనం


ఒంటిమిట్ట కోదండ రామాలయం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 11: కోదండరాముడి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో కోయిల్ ఆల్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు. ఈనెల 17 నుంచి 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో కోయిల్ ఆల్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. శుక్రవారం తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలుపుతారు. అనంతరం ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామాగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీ గడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర మిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. కాగా ఆలయంలో శనివారం ఉదయం పసుపు దంచే కార్యక్రమం చేపట్టనున్నారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 22వ తేదీ అత్యంత వైభవంగా జరిగే సీతారాముల కల్యాణంలో ఈ పసుపును వినియోగిస్తారు.

నేడు టీటీడీ ఈవో రాక

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించేందుకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి శుక్రవారం ఉదయం కల్యాణ వేదిక ప్రాంతాన్ని పరిశీలించనున్నారు. ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో కల్యాణోత్సవాన్ని చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించనున్నారు.

మోదీ పాలన దేశానికి అవసరం : నల్లారి కిరణ్

● రాక్షస పాలనను తరిమికొడదాం : సుగవాసి

● వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక


సానిపాయి సర్పంచ్, ఎంపీటీసీలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బాలసుబ్రమణ్యం, చిత్రంలో ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

వీరబల్లి, ఏప్రిల్ 11 : మన దేశానికి, రాష్ట్రానికి మోదీ పాలన ఎంతో అవసరమని అదే విధంగా రాష్ట్రంలో ఎక్కడ చూసినా కేంద్ర పథకాలే కనిపిస్తాయని రాజంపేట పార్లమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సానిపాయిలో సర్పంచ్ నేతి ఆంజనేయులు ఆయన సతీమణి ఎంపీటీసీ పెద్దిరెడ్డెమ్మలు వైసీపీ నుంచి గురువారం ఎమ్మెల్యే అభ్యర్థి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. అనంతరం ఎక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో నల్లారి కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అభ్యర్థులతోనే అభివృద్ధి జరుగుతుందని వారిని ఆదరించి ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రజలకు అనునిత్యం దగ్గరుండి చూసుకునే వ్యక్తి ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం అని అలాంటి వ్యక్తికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిందని, దానిని తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయని ప్రతిఒక్కరూ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ప్రస్తుతం పార్టీలో చేరిన సర్పంచ్, ఎంపీటీసీలకు వారి వర్గీయులకు ఎల్లప్పుడూ అండుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తమ గ్రామానికి ఎటువంటి అభివృద్ధి జరగలేదని సానిపాయి సర్పంచ్ నేతి ఆంజనేయులు తెలిపారు. తనని నమ్ముకున్న వారికి ఏమీ చేయలేకపోయానని, దాంతోనే నేను నా భార్య ఎంపీటీసీ పెద్దిరెడ్డెమ్మ, తమ వర్గీయులంతా బాలసుబ్రమణ్యం మీద నమ్మకంతో టీడీపీలో చేరామని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట టీడీపీ నాయకుడు పోలి సుబ్బారెడ్డి, జనసేన నాయకులు యల్లటూరి శ్రీనివాసరాజు, బీజేపీ నాయకులు సాయిలోకేశ్, నాగోతు రమేశ్‌నాయుడు, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ ఎద్దల లక్ష్మీప్రసాద్, రామలింగయ్య నాయుడు, వీరబల్లి బీజేపీ నాయకులు నరేంద్ర, పలువురు టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయంత్రానికే దుకాణాలు బంద్

● ఈసీ ఆదేశాలంటూ మద్యం షాపులు మూసివేత ● కర్ణాటక మద్యం, నాటుసారా వైపు మందుబాబులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 11: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రాత్రి 10 గంటల వరకు మద్యం విక్రయించేవారు. కానీ వారం రోజులుగా జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు సాయంత్రం 4 గంటలకే మూతపడుతున్నాయి. పగలంతా కష్టపడి కాస్తా మత్తు కోసం మద్యం దుకాణాలకు సాయంత్రంపైన వచ్చిన వారికి మూతపడిన మద్యం దుకాణాలు వెక్కిరిస్తున్నాయి. ఇదేమిటని మద్యం దుకాణాల సేల్స్‌మెన్‌ను ప్రశ్నిస్తే ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలి కదా అని సమాధానాలు వస్తున్నాయి. మదనపల్లె ఎక్సైజ్ డిపో పరిధిలో 67 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండగా, వాటిలో అన్నమయ్య జిల్లా పరిధిలో 38 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో నిత్యం రూ.1.15 కోట్ల నుంచి రూ.1.60 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. పండుగలు, జాతరల సందర్భంలో ఇంకా ఎక్కువే విక్రయాలు జరుగుతాయి. కాగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక రాజకీయ నాయకులు ఓటర్లను, నాయకులను ప్రలోభపెట్టేందుకు మద్యంను ఎరచూపుతారనేది జగమెరిగిన సత్యం. దీంతో ఎన్నికల కమిషన్ కొన్ని నిబంధనలు పెట్టింది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో గతేడాది (ఏప్రిల్, మే నెలల్లో) జరిగిన విక్రయాల కంటే 30 శాతం అధికంగా మాత్రమే మద్యం విక్రయాలు జరపాలని, అది దాటిన తరువాత ఆ రోజుకు మద్యం విక్రయాలు జరపకూడదని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో జిల్లాలోని 38 ప్రభుత్వ మద్యం దుకాణాలు సాయంత్రం 4 గంటలకే వారి టార్గెట్ విక్రయాలు పూర్తి కావస్తుండటంతో దుకాణాలు మూసివేస్తున్నారు. రాజకీయ నాయకుల ప్రచారంలో వెంట వచ్చే కార్యకర్తలకు ఉదయం 10 గంటలకే ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మద్యం తీసుకొచ్చి తాపించేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో మద్యం దుకాణాల టార్గెట్ సాయంత్రానికే ముగుస్తుండటంతో మూసివేస్తున్నారు. దీంతో మందుబాబులు దిక్కుతోచక కర్ణాటక మద్యం, నాటుసారా ఎక్కడ దొరుకుతుందా అని పరుగులు తీస్తున్నారు. ఇకపోతే మదనపల్లెలోని ప్రైవేటు బార్లకు మందుబాబులు క్యూ కడుతున్నారు. సాయంత్రానికే ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడుతుండటంతో మందుబాబులు బార్లవైపు ఎగబడుతున్నారు. దీంతో బార్‌ల యజమానులు బీర్లతో పాటు, మద్యం ధరలను విపరీతంగా పెంచేశారు. తమకు ప్రతి నెలా గతేడాది ఎంత స్టాకు ఇచ్చారో..అంతే స్టాకు ఇప్పుడు కూడా ఇస్తున్నారని బార్ల యజమానులు చెబుతున్నారు.



మదనపల్లెలో సాయంత్రం 4 గంటలకే మూతపడిన ప్రభుత్వ మద్యం దుకాణం

పెరిగిన కర్ణాటక మద్యం, నాటుసారా విక్రయాలు

మత్తుకు అలవాటుపడిన మందుబాబులు ప్రభుత్వ మద్యం దుకాణాలు సాయంత్రానికే మూతపడుతుండటంతో బెల్టుషాపులు, కర్ణాటక మద్యం, నాటుసారా ఎక్కడ దొరుకుందా అని ఆరా తీస్తున్నారు. సందట్లో సడేమియా అంటూ మదనపల్లె, ములకలచెరువు, వాల్మీకిపురం ఎస్ఈబీ సర్కిల్‌ల పరిధిలో కర్ణాటక మద్యం విక్రయాలు పెరిగాయి. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలు కర్ణాటక సరిహద్దులో ఉండటంతో ఇక్కడ సరిహద్దు చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. కేవలం కార్లు, ద్విచక్రవాహనాలు, బస్సులను మాత్రమే తనిఖీ చేస్తున్నారు కాని భారీ వాహనాలైన లారీలు, కంటైనర్లను తనిఖీ చేయడం లేదు. దీంతో కర్ణాటక మద్యం సరిహద్దులు దాటి మారుమూల గ్రామాలకు కూడా వెళుతున్నట్లు తెలుస్తోంది.

ఈసీ ఆదేశాలు పాటిస్తున్నాం..

మదనపల్లె ఎక్సైజ్ డిపో పరిధిలో సాయంత్రానికే ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసివేయాలని తాము ఎవ్వరికి చెప్పలేదు. కాకుంటే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గతేడాది ఏప్రిల్ నెలలో ప్రతి మద్యం దుకాణంలో జరిగిన విక్రయాలకు 30 శాతం అధికంగా మాత్రమే మద్యం విక్రయాలు జరపాలి. టార్గెట్ పూర్తయ్యాక మద్యం విక్రయాలు నిలుపుదల చేస్తున్నాం. బార్లకు కూడా గతేడాది ఏప్రిల్ నెలలో ఎంత స్టాకు ఇచ్చామో ఇప్పుడు కూడా అంతే ఇస్తున్నాము.

- వినయ్‌బాబు, ఎక్సైజ్ ఈఎస్,
అన్నమయ్య జిల్లా

ఉప్పరవారిపల్లెలో విషాదం

● చెరువులో బట్టలు ఉతికేందుకు వెళ్లి జారి పడిన బాలికలు

● ఒకరు మృతి.. ఇద్దరు ఆసుపత్రిలో చేరిక

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 11 : చెరువులో బట్టలు ఉతికేందుకు వెళ్లి చెరువులో జారి పడి ఒక బాలిక మృతి చెందిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో గురువారం జరిగింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రాపూరివాండ్లపల్లె పంచాయతీ ఉప్పరవారిపల్లెకు చెందిన ఇమ్మానుయేల్, శివకుమారి దంపతులకు లియోనా (12), నక్షత్ర అనే ఇద్దరు బాలికలు ఉన్నారు. ఇమ్మానుయేల్ వ్యవసాయ కూలీగా, శివకుమారి ఆశావర్కర్‌గా ఉంటూ తమ కుటుంబాన్ని పోషించుకునే వారు. కాగా ఇటీవల ఇమ్మానుయేల్‌కు రోడ్డు ప్రమాదం జరగడంతో అతడితో పాటు భార్య శివకుమారిలు ఆసుపత్రిలో ఉన్నారు. కాగా గురువారం ఇమ్మానుయేల్ సోదరి అయిన ప్రేమలత (ప్రేమీ)తో కలసి ఇద్దరు పిల్లలు పక్కనే ఉన్న చెరువులోకి బట్టలు ఉతికేందుకు వెళ్లారు. బట్టలు ఉతుకుతుండగా లియోనా అనే అమ్మాయి ప్రమాదవశాత్తు చెరువులోకి జారిపడడంతో పక్కనే ఉన్న నక్షత్ర కాపాడే ప్రయత్నం చేయగా ఆ అమ్మాయి కూడా చెరువులోకి పడిపోయింది. వెంటనే వారి అత్త అయిన ప్రేమలత వారిద్దరిని కాపాడే ప్రయత్నంలో భాగంగా లియోనాను బయటికి తీసింది. నక్షత్ర కూడా నీటిలో మునుగుతుండడంతో ఆ అమ్మాయిని కాపాడే ప్రయత్నంలో ఆమె కూడా చెరువులో పడిపోయింది. ఇది గమనించిన స్థానికులు వీరిద్దరిని గ్రామస్థుల సహాయంతో వెలికితీశారు. అప్పటికే లియోనా నీరు అధికంగా తాగేయడంతో మృతి చెందింది. ప్రేమలతతో పాటు నక్షత్రను వెంటనే బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నక్షత్ర బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ప్రేమలత పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను తిరుపతికి తరలించారు. లియోనా మృతితో ఉప్పరవారిపల్లెలో తీవ్ర విషాదం నెలకొంది.


మృతి చెందిన లియోనా ఫైల్ ఫొటో

పక్కదారి పడుతున్న మద్యం

● మధ్యాహ్నానికే మద్యం షాపుల మూసివేత

పెనగలూరు, ఏప్రిల్ 11: మండలంలోని ప్రభుత్వ మద్యం షాపుల్లో మద్యం నిల్వలు పక్కదారి పడుతున్నాయని పలువురు మద్యం బాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నానికే నిర్వాహకులు షాపు మూసివేసి వెళ్లిపోతున్నారు. మండలంలో పెనగలూరు, బెస్తపల్లి, చక్రంపేట గ్రామాల్లో మూడు ప్రభుత్వ మద్యం షాపులు నడుస్తున్నాయి. అయితే ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు షాపులు తెరిచి మద్యం విక్రయించాల్సి ఉండగా నాలుగు రోజుల నుంచి ఉదయం 10 గంటలకు షాపు తెరిచి మధ్యాహ్నం 3 గంటల లోపే టార్గెట్‌ను పూర్తి చేసుకొని నిర్వాహకులు షాపు మూసివేసి వెళ్లిపోతున్నారు. మద్యం ప్రియుల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం.. కొంతమంది బెల్టుషాపులు నడిపే వ్యక్తులు ఒక్కో బాటిల్‌పై అదనంగా 20 రూపాయలు చెల్లించి ఒక్కో వ్యక్తి పది నుంచి 20 బాటిళ్ల తీసుకుపోతున్నట్లు సమాచారం. దీంతో ఒక రోజంతా అమ్మాల్సిన టార్గెట్ మధ్యాహ్నానికి పూర్తి చేసుకుని వెళ్లిపోతున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఎన్నికలు సమీపిస్తున్నందువల్ల అధికార పార్టీ నాయకులు వారి అనుచరుల ద్వారా మద్యం భారీగా షాపుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మద్యం షాపుల్లో వారి అనుచరులే పనిచేస్తున్నందువల్ల ఆ పార్టీ నాయకులు సిఫార్సు చేసిన వారికి, ఫోన్లలో సమాచారం ఇచ్చిన వారికి, లేఖలు పంపిన వారికి ఎన్ని కావాల్సి వస్తే అన్ని బాటిళ్ల నిర్భయంగా తీసుకొని వెళుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఈ విషయమై రాజంపేట ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వై.వి.పవన్‌కుమార్‌ను వివరణ కోరగా ఎక్సైజ్ పాలసీ ప్రకారం గత ఏడాది ఏప్రిల్‌లో ఎంత శాతం మేర అమ్మకాలు జరిపారో అదే విధంగా షాపులలో టార్గెట్ ప్రకారం అమ్మకాలు జరపాల్సి ఉంటుందన్నారు. ఒకరోజుకు ఇచ్చిన టార్గెట్ త్వరగా పూర్తయిపోతే ఆ రోజుతో ఆ షాపు టార్గెట్ నిలిచిపోతుందన్నారు. ఒకవేళ ఎవరైనా మద్యం కావాలని షాపు వద్దకు వస్తే అక్కడ టార్గెట్ పూర్తయినందువల్ల అక్కడ ఇవ్వరని మరోషాపుకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల సమయం కాబట్టి షాపుల వద్ద ఖచ్చితమైన నియమాలు పాటించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.


మధ్యాహ్నం 3 గంటలకు మూతపడిన మద్యం షాపు

'మండే' వేసవి... బీకేర్ ఫుల్

- అజాగ్రత్తగా ఉంటే తప్పదు ముప్పు
- పొంచి ఉన్న అగ్నిప్రమాదాలు
- జాగ్రత్తలు తప్పక పాటించాలి
- లేకపోతే అస్తి, ప్రాణ నష్టం తప్పదు

కడప (క్రైం), ఏప్రిల్ 11: రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. ప్రచండ భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మార్చి, ఏప్రిల్ నెలల్లోనే చెమటలు కక్కిస్తున్న ఎండలు మరింత ముదిరే అవకాశాలున్నట్లు తెలుస్తుంది. ఇకపోతే వేసవి కాలం వచ్చిందంటే చాలు.. నగరాలు, పట్టణ గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో అగ్ని ప్రమాదాల భయం వెంటాడుతుంది. వేసవికాలంలో రోజూ ఏదోక ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అగ్ని ప్రమాదాలకు గురై పలువురు ఆస్తి, ప్రాణనష్టాలకు గురైన సంఘటనలు జిల్లాలో చోటు చేసుకున్నాయి.



మంటలను అర్పుతున్న అగ్రిమాపక సిబ్బంది (ఫైల్‌ఫొటోలు)

అగ్ని ప్రమాదాలు ఎక్కువగా వేసవి కాలంలోనే జరుగుతుంటాయి. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమై ప్రజలకు అగ్ని ప్రమాదాలు నివారణ చర్యలపై పలు జాగ్రత్తలు చేస్తున్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో బోద కొట్టాలలో ఎక్కువ శాతం నివాసాలు ఉండేవారు. ప్రస్తుతం బోద కొట్టాలు కాకుండా మిద్దెలు, భవనాల్లో నివాసం ఉంటున్నారు. అయినా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, ఇతర కారణాలతో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వేసవి కాలం కావడంతో నీటి సమ స్య కూడా కొన్ని ప్రాంతాల్లో తీవ్రంగా ఉంది. మరికొన్ని ప్రాంతాల్లో ఫైర్ కేంద్రాల్లో సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లావ్యాప్తంగా అగ్నిమాపక శాఖలో సిబ్బంది కొరత ఉంది. కొంత మంది వ్యాపారులు, అపార్ట్‌మెంటు నిర్వాహకులు, స్కూళ్లు, ఆసుపత్రులు తదితర ప్రాంతాల్లో అగ్నిమాపక పరికరాలు లేకుండా భవన నిర్మాణాలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ అగ్నిమాపకశాఖ అధికారులు సూచనలు, జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు ఇలా..

- గృహాలు, వంటిల్లులో వంటింటి కింది, పై భాగాల్లో గాలి, వెలుతురు వచ్చేలా ఏర్పాటు చేసుకోవాలి. దీనివల్ల గ్యాస్‌లీకైనా ఎటువంటి ప్రమా దం ఉండదు. ఎల్‌పీజీ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులేటరు వాల్వ్ ఆఫ్ చేయాలి. మండుతున్న కిరోసిన్ స్టవ్‌లో కిరోసిన్ పోయకూడదు. చిన్నపిల్లలకు దగ్గరగా అగ్గిపెట్టెలు, మండే వస్తువులను ఉంచకుండా దూరంగా పెట్టాలి.
- వంటగదిలో కిరోసిన్, పెట్రోలు, అదనపు సిలిండరు ఉంచకూడదు.
- వంట నూనె మండినప్పుడు దానిపై గోధుమ పిండి కానీ, రాగి పిండి,వంట సోడా చల్లితే మంచిది. ఎక్కువ రోజులు ఊర్లకు వెళ్లేటప్పుడు కరెంటు మెయిన్ ఆఫ్ చేయాలి.

గ్రామీణ ప్రాంతాల్లో....

- పూర్తిగా ఎండిన గడ్డిని మాత్రమే వాములుగా వేయాలి. గడ్డివాములు నివాస గృహాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- గడ్డివాములను గాలికి వాట ంగా నిర్మించాలి. గుడిసె గుడిసెకు కనీసం దూరంలో ఏర్పాటు చేసుకోవాలి.
- పందిళ్ల చుట్టూ కనీసం 45 మీటర్లను ఉండేలా జాగ్రత్త పడాలి.
- అతుకుల విద్యుత్ వైరును పందిరికి తగిలించడం ప్రమాదకరం.



గోదాములు, గిడ్డంగుల్లో...

- స్టాకును స్లీపర్‌పై మాత్రమే నిర్వహించాలి. నిల్వల మధ్యలో గ్యాంగేవు, క్రాస్ పేరు, తగినంత నీరు ఇతర అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకుని... అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించాలి.
- వస్తువుల ఎగుమతి, దిగుమతి ట్రక్కులు, ఇతర వాహనాల ఇంజన్లు ఫ్లేమ్‌ప్రూఫ్ మోటరు స్పార్క్ ఉపయోగించాలి. పరిశ్రమల్లో అగ్నిప్రమా దాలను అరికట్టడానికి సరిపడే నీటిని ఫిక్స్‌డ్ విషర్స్ నిబంధనల మేరకు నిల్వ చేసుకోవాలి.

ఇతర జాగ్రత్తలు

- మీ దుస్తులకు నిప్పుఅంటుకుంటే దొర్లాడి దుప్పటి చుట్టుకోవాలి.
- మంటలు వస్తున్న గదుల్లో మో చేతులు, మోకాళ్లతో పాకుతూ బయటికి రావాలి.
- ముక్కు, నోటికి అడ్డంగా తడి గుడ్డ పెట్టుకుని పీల్చడం ద్వారా పొగ లోపలికి పోకుండా ఉంటుంది.
- అగ్నిని పుట్టించే పదార్థాలను దూరంగా ఉంచాలి.
- అగ్నిప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో ఫైర్ సిబ్బందికి ఫోను చేసి అగ్నిప్రమాదాలపై సమాచారం ఇవ్వాలి.

జ్యోతిరావుపూలే మార్గం ఆదర్శనీయం



పూలేచిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ చింతా సుధాకర్

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 11: అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడంలో జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావుపూలే అని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. గురువారం పూలే జయంతిని పురస్కరించుకుని వైవీయూలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలోని మనందరం జ్యోతి బాపూలే వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవాలన్నారు. పూలే ఆయన సతీమణితో కలిసి బాలికల విద్యకు, మహిళల అభ్యున్నతికి, అనేక సంస్కరణలకు మూలాలుగా నిలిచారని కీర్తించారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుడు మహాత్మజ్యోతి రావు పూలే



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్‌ఓ

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 11: అనగారిన వర్గాల కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడు మహాత్మజ్యోతిరావు పూలే అని డిఆర్‌ఓ సత్యనారాయణ అన్నారు. గురువారం జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని మహత్మజ్యోతి రావ్ పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మహ త్మజ్యోతి రావ్ కులవివక్షతపై ఎన్నో పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి సందప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పొగాకు గోడౌన్ దగ్ధం

- దాదాపు రూ.25 లక్షలు ఆస్తినష్టం



మంటలను ఆర్పుతున్న స్థానికులు

ఖాజీపేట, ఏప్రిల్ 11: మండల పరిధిలోని ముస్లిం కాలనీ సమీపంలో పొగాకు గోడౌన్‌లో షార్ట్‌సర్క్యూట్ జరిగి పొగాకు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే... రంజాన్ పండుగ సందర్భంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగి షేక్ ఫయాజ్ గోడౌన్‌లో పూర్తిగా మిషన్లు, పొగాకు దగ్ధమైంది. చుట్టుపక్కల వారు గమనించి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే వచ్చి గోడౌన్ ఓపెన్ చేయగా అప్పటికే సగానికి పైగా పొగాకు కాలిపోయింది. అనంతరం మైదుకూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికీ జరగరాని నష్టం జరిగింది. సుమారు రూ.25 లక్షలు నష్టం వాటిల్లిందని యజమాని తెలిపారు.

రూ. 3,48,500 నగదు సీజ్

కొండాపురం, ఏప్రిల్ 11: జిల్లా సరిహద్దుల్లోని కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద గురువారం సాయింత్రం పోలీసులు రూ. 3,48,500 లక్షల నగదు సీజ్ చేశారు. తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ నగదును స్వాధీనపరచుకున్నారు. చిత్తూరు నుండి తాడిపత్రికి కారులో గణేష్ అనే వ్యక్తి నగదు తీసుకెళుతుండగా, అతని నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ నగదును ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు

టీడీపీ ప్రచార రథంపై దాడి



కడప (క్రైం), ఏప్రిల్ 11: కడప నగరం మాసాపేటలో ఉన్న టీడీపీ ప్రచార రథంపై ఓ వ్యక్తి రాయిని విసిరివేడంతో వాహనంపై ఉన్న డిజిటల్ లైట్ ధ్వంసమైంది. దీంతో వాహన డ్రైవర్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు. శ్రీనివాసరెడ్డితో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి మా ధవీరెడ్డి అక్కడికి చేరుకుని వాహనాన్ని పరిశీలించారు. ఈ మేరకు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

ములకలచెరువు, ఏప్రిల్ 11: ములకలచెరువు మండలంలో గురువారం దాడులు నిర్వహించి భారీగా కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. చౌడసముద్రం పంచాయతీ గుత్తావారిపల్లెలో రెండు సంచుల్లో ఉన్న కర్ణాటక మద్యం ప్యాకెట్లు పట్టుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బుక్కేకృష్ణానాయక్(47)ను అరెస్టు చేసి 280 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.14,647 ఉంటుందని పేర్కొన్నారు.

పుష్పపల్లకిలో ఊరేగిన రేణుకా అమ్మవారు

ములకలచెరువు, ఏప్రిల్ 11: మండలంలోని దేవళ చెరువు పంచాయతీ యర్రం రెడ్డిగారిపల్లెలో వెల సిన రేణుకా యల్లమ్మ అమ్మవారు గురువారం పుష్ప పల్లకిలో ఊరేగా రు. తిరుణాల ఉత్సవాల్లో భాగంగా బుధ, గురువారాలు అమ్మవారి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. విద్యుద్దీపాలకరణతో బళ్ళారి డప్పు లు, పండరీ భజనలు, పిల్లనగ్రోవి, కోలాటాలు, బాణా సంచా పేలుళ్ళ మధ్య అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని యర్రంరెడ్డిగారిపల్లె, మావళ్ళవారిపల్లె గ్రామాల్లో ఊరేగించారు. గురువారం మధ్యాహ్నంతో ఊరేగింపు ముగిసింది. దీంతో మూడు రోజులుగా జరుగుతున్న అమ్మవారి తిరు ణాల ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని అమ్మవారికి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జ్యోతి ఉత్సవంలో లడ్డు, చీరలు వేలం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 11: స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వ రీదేవి జ్యోతిఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి లడ్డు, చీరలు వేలం నిర్వహించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు ఉప్పురామచంద్ర, కార్య దర్శి గుండ్లపల్లె ప్రభాకర్, ట్రెజరర్ లోకేష్ ఆధ్వర్యంలో లడ్డు రూ. 9 వేలు వేలం పాటలో ధర పలికింది. అమ్మవారికి సమర్పించిన చీరలను వేలం నిర్వహించారు. అమ్మవారి జ్యోతి ఉత్సవాలు ముగింపు సందర్భంగా అమ్మవారిని భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొని అమ్మవారి చీరలను వేలంపాటలో దక్కించు కున్నారు.

17న సీతారాముల కల్యాణం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 11: స్థానిక వరాలాంజనేయస్వామి ఆలయం లో ఈనెల 17న సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 17వరకు శ్రీరామనవమి మహోత్సవాలు అత్యంతవైభవంగా నిర్వహిస్తునట్లు ఆలయకమిటీ సభ్యులు గురువారం మీడియా సమావేశంలో వెల్లడించారు.

అస్తవ్యస్త జిల్లాల విభజనతో తీవ్ర నష్టం

- ఒక్క చాన్స్ పేరిట వచ్చిన జగన్‌తో రాష్ట్రం అధోగతి
- మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి



మేధావుల సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

రాజంపేట, ఏప్రిల్ 11: రాష్ట్ర విభజన వల్ల తీవ్రంగా నష్టపోయామని, అస్తవ్యస్త జిల్లాల విభజనతో ఎంతో నష్టం జరిగిపోయిందని, దీనిపై ప్రజల్లో చాలా బాధ ఉందని, దానికి అనుగుణంగా చర్యలు చేపట్టడానికి తనవంతు కృషి చేస్తానని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి రాజంపేట బీజేపీ పార్లమెంటు కార్యాలయంలో పార్టీ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ ఆధ్వర్యంలో జరిగిన మేధావుల సభలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విభజనకు ముందు ఉన్న జిల్లాలంటేనే అందరూ ఇష్టపడుతున్నారని, తన అభిప్రాయం కూడా ఇదే అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క ఛాన్స్ పేరిట అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అదోగతిపాలు చేశాడన్నారు. తనవల్లే రాష్ట్ర విభజన జరిగిందనడం, తానే జగన్‌మోహన్‌రెడ్డిని అరెస్టు చేయించానని పేర్కొనడం దుర్మార్గమన్నారు. ఆయన అవినీతి కేసులపై న్యాయస్థానం తీర్పు ఉంటుంది తప్ప తన ప్రమేయం ఏం ఉంటుందన్నారు. చట్టాలకు లోబడి అరెస్టులు జరుగుతాయని ముఖ్యమంత్రికి తెలిసి అరెస్టులు జరగవన్నారు. రాజంపేట ప్రస్తుత పార్లమెంటు అభ్యర్థి మిథున్‌రెడ్డి, ఆయన తండ్రి ఇరువురు ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. తాను ఈ ప్రాంత ప్రజల మనోభావాలకు అనుగుణంగా వారి అభివృద్ధి కోసం పాటుపడతానన్నారు. రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన వెంటనే అన్ని సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఇక్కడ పాల్గొన్న మేధావులందరూ కూటమి ఉద్దేశ్యాన్ని గమనించి అందరూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పలువురు న్యాయవాదులు, డాక్టర్లు, ప్రముఖులు మాట్లాడుతూ రాజంపేటకు జరిగిన అన్యాయంపై తీవ్ర విమర్శలు చేశారు. రాజంపేట జిల్లా కేంద్రం కావడం అటుంచి ఉన్న వనరులను కూడా తరలించుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ న్యాయవాది సింగంశెట్టి రవీంద్ర, నాగా సుధాకర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాసరుద్దీన్, కరుణాకర్‌రాజు, శోభ, రామచంద్రనాయుడు, లక్ష్మీనారాయణ, డాక్టర్ సుధాకర్, బాలరాజు, జయచంద్ర తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది హనుమంతునాయుడు, ఆడిటర్‌మురళీ కృష్ణ, షబ్బీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి వ్యక్తి దుర్మరణం

కడప (క్రైం), ఏప్రిల్ 11: కడప నగరంలోని రైల్వేస్టేషన్ యార్డు వద్ద కడప టౌన్‌కు చెందిన రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ జ్ఞానగిరి వెంకటసుబ్బయ్య (72) అనే వ్యక్తి రైలుకింద పడి మృతి చెందాడు. కడప రైల్వే ఎస్‌ఐ వివరాల మేరకు.. వెంకటసుబ్బయ్య గురువారం ఉదయం 10.55 గంటల సమయంలో అంగడివీధి నుంచి కడప టౌన్‌లోకి నడుచుకుంటూ వెళుతుండగా రైల్వే స్టేషన్ యార్డు వద్ద గుర్తు తెలియని రైలు కింద పడి మృతి చెందాడు. సంఘటనలో తల, మొండెం వేరు పడ్డాయి. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు అక్కడకి చేరుకుని మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ అన్నదమ్ములు మృతి

ముద్దనూరు ఏప్రిల్ 11: మండల పరిధి ఎర్రగుంట్ల రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో బుధవారం కారు, బైకు ఢీకొన్న సంఘటనలో అన్నదమ్ములు గాయపడిన విషయం తెలిసిందే. సింహాద్రిపురం టౌన్‌కు చెందిన శశిధర్‌రెడ్డి (30), జగదీశ్వరరెడ్డి(28) ఇరువురు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహాలకు ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చెన్నూరు, ఏప్రిల్ 11: మండలంలోని బలసింగాయపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఇసుక క్వారీ ఉన్న ప్రాంతానికి వెళ్లి ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రెవెన్యూ కార్యాలయానికి అప్పగించారు.

పక్కాప్లాన్‌తో హత్య

- వివాహేతర సంబంధమే కారణం



హత్య చేసిన నిందితులతో డీఎస్పీ యశ్వంత్, సీఐ ఈశ్వరయ్య

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 11: ఎర్రగుంట్ల దర్గాబజార్ శాంతినగర్‌కు చెందిన గోగుల రాంబాబు(30)ను అతని భార్య మాధవి ప్రియుడితో కలిసి పక్కాప్లాన్‌తో హత్య చేసినట్లు జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్, ఎర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్యలు తెలిపారు. గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎర్రగుంట్ల శాంతినగర్ దర్గా బజార్‌కు చెందిన రాంబాబు భార్య మాధవి ముద్దనూరుటౌన్‌కు చెందిన భరత్‌బాబుతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఇది తెలిసిన రాంబాబు మాధవీని తీవ్రంగా మందలించాడు. దీంతో ఆమె ప్రియుడు భరత్‌బాబుకు విషయం తెలిపి తమకు అడ్డుగా ఉన్న రాంబాబును తొలగించు కునేందుకు కుట్రపన్నారు. ఇందుకోసం రాంబాబు పేరుమీద ఎస్‌బిఐలో రూ.20లక్షలకు ప్రమాదబీమాను పాలసీ కట్టారు. ఏప్రిల్ 2వ తేదీ అర్ధరాత్రి 8.30 గంటల ప్రాంతంలో మద్యం సేవించేందుకు నిడుజువ్వి దగ్గరకు భరత్ తనకు సహాయంగా కిరణ్ కుమార్, పసుపల మునయ్య, బెల్లంకొండ చిన్నరాజలతో కలిసి రాంబాబును తీసుకెళ్లాడు. అక్కడ రాంబాబు గొంతును టవల్‌తో బిగించి, తలపై రాడ్డుతో కొట్టి చంపారు. మృతదేహాన్ని రోడ్‌సైడ్ పడవేశారు. పక్కనే మోటార్‌సైకిల్‌ను పడేసి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. అలాగే ప్రమాద బీమా డబ్బులను అందరూ కలిసి పంచుకునేందుకు ప్లాన్ వేశారు. అయితే ఈ విషయాన్ని చాకచక్యంగా పసిగట్టిన పోలీసులు ముందుగా అనుమానస్పద మృతిగా కేసునమోదు చేశారు. పూర్తి స్థాయిలో విచారించి అసలు నిజాలను బయటకు లాగారు. గాజుల భరత్‌బాబు, గోగుల మాధవి, మాధవి తల్లి లక్ష్మీదేవి, కిరణ్‌కుమార్, మునయ్య, చిన్నరాజలను గురువారం అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరచినట్లు డీఎస్పీ, సీఐలు పేర్కొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం


వాల్మీకిపురం, ఏప్రిల్ 11: వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో కృతికా నక్షత్రం సందర్భంగా గురువారం వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మ ణ్యస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని కళ్యాణ మండపంలో షిరిడీ సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు శాస్త్రో క్తంగా వళ్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి వారిని కళ్యాణ వేదికపై ముస్తాబు చేసి కల్యాణోత్సవం భక్తిశద్ధలతో నిర్వహించారు. ఆలయంలోని సుబ్రహ్మ ణ్యస్వామి, కార్యసిద్ధి అభయాంజనేయస్వామి, సిద్ధి గణపతి, ధ్యాన షిరిడీసాయిబాబా, శనేశ్వ రస్వామి, లింగోద్భవ మహాశివున్ని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. ట్రస్టు ప్రతినిధులు వసంతమ్మ, కోమల, శశికళ, రాధమ్మ, అరుణ, వెంకటేష్ పాల్గొన్నారు.

సింహప్రభ వాహనంపై చౌడేశ్వరిదేవి

కలకడ, ఏప్రిల్ 11: కలకడ మండలం కోనలో వెలసిన చౌడేశ్వరి ఉత్సవాలలో భాగంగా తోగటవీర క్షత్రీయ సంఘం ఆధ్వర్యంలో అమ్మ వారు సింహప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పుష్పపల్లకిని రంగు రంగుల దీపాలతో అలంకరించారు. జ్యోతుల ఊరేగింపు, మంగళ వాయిద్యాలు, కేరళ చండీమేళం, కాట్పాడి వారి బాణసంచా, యువకుల కేరింతలతో కోలాహలంగా అమ్మవారిని ఊరేగిం చారు. కోనతో పాటు ప్రక్క గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శిం చుకున్నారు. గ్రామానికి చెందిన యువకుడు లోకేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలంటే... డబులింజన్ సర్కార్‌కు ఓటేయండి

- టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సి.ఆదినారాయణరెడ్డి



తిప్పలూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి, పక్కన భూపేష్‌రెడ్డి

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 11: రాష్ట్రంలో అభివృద్ధి కావాలంటే కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ డబుల్‌ఇంజన్ సర్కార్ అధికారంలోకి రావాల్సిందేనని టీడీపీ ఎంపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సి.ఆదినారాయణరెడ్డిలు పేర్కొన్నారు. తిప్పలూరులోని ఏకేఆర్ కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం ఎన్డీయే ఎర్రగుంట్ల మండల కూటమి పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్డీయే ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని దోచేశాడన్నారు. ఇంటిపన్ను, చెత్తపన్ను, విద్యుత్‌పన్ను, ఇలా అన్ని రకాల పన్నులు వేసి ప్రజల నడ్డివిరచారన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి ఏ రోజు కూడా జిల్లా సమస్యలు పార్లమెం టులో ప్రస్తావించిన పాపాన పోలేదని విమర్శించారు. రాష్ట్రంలో విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని కేంద్రం సహాయంతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి బాటలో నడిపించే సత్తా వున్న నాయకుడన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి సొంత టిప్పర్లు పెట్టి ఇసుకను అక్రమంగా, ట్యాంకర్లను పెట్టుకుని ఫ్లైయాష్‌ను రవాణా చేస్తూ సొంత ఆదాయాన్ని పెంచుకుంటున్నారే తప్ప ఏ ఒక్క అభివృద్ధి పని చేయలేదన్నారు. ఎన్డీయే ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ తన హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప గత ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. వివేకానందరెడ్డి హత్య కేసులో అవినాష్‌రెడ్డితోపాటు జగన్‌కు, ఆయన సతీమణి భారతికి కూడా భాగస్వామ్యవుందని ఆరోపించారు. త్వరలో ఆ విషయాలు కూడా బయటికి వస్తాయన్నారు. సొంత చెల్లెళ్లు ఊరూరా తిరిగి వివేకానందరెడ్డి హత్యకేసు, జగన్ అవినీతి గురించి చెబుతు న్నారని.. ఇప్పటికైనా ప్రజలు తెలుసుకుని అభివృద్ధి చేసే డబుల్ ఇంజన్ సర్కార్‌కు ఓట్లేయాలని కోరారు. ఎమ్మెల్యే కమిషన్ల కోసం కక్కుర్తి పడి తన హయాంలో మంజూరు చేయించిన రూ.110 కోట్ల గండికోట తాగు నీటి స్కీంను కూడా తుంగలో తొక్కారన్నారు. ఎమ్మెల్యేగాని, ఎంపిగాని నియోజవర్గానికి చేసిందేమీలేదన్నారు.

మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి మాట్లాడుతూ తాము ఎవరి జోలికి వెళ్లమని.. అలాగని తమ జోలికి వస్తే ఊరుకునే ప్రశక్తేలేదన్నారు. టీడీపీ, బీజేపీ జనసేన ఇన్‌చార్జి జగదీష్, కార్యకర్తలు, నాయ కులు, మండల ఇన్‌చార్జి జయరామిరెడ్డి, సి.రామాంజి ల్‌రెడ్డి, సి.శివనారాయణరెడ్డి, రాజేష్‌రెడ్డి, బీజేపీ మండల ఇన్‌చార్జి జగన్ మోహన్‌రెడ్డి, టీడీపీ మండల ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి, టౌన్ ఇన్‌చార్జి సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

'మానవత'కు రూ.20 వేలు వితరణ



మానవత సభ్యులకు చెక్కును అందిస్తున్న దాత రవీంద్రనాథ్

చిట్వేలి, ఏప్రిల్ 11: మానవతా సేవా కార్యక్రమాల్లో- మేము సైతం అంటూ విశ్రాంతి ఎంఈఓ దోసెల రవీంద్రనాధ్ రూ.20,001 చెక్కును వితరణగా అందించారు. ఈ మేరకు స్థానిక శివాలయంలో మానవతా సభ్యులకు గురువారం అందించారు. ప్రతిభకు పట్టం కడతాం అనే కార్యక్రమంలో విద్యార్థులకు ప్రోత్సాహం కింద నిర్వహించే కార్యక్రమాలకు దీన్ని ఉపయోగిస్తామన్నారు. చిట్వేలి వాస్తవ్యులు, విశ్రాంత ఎంఈఓ రవీంద్రనాథ్, శ్రీమతి కళ్యాణమ్మలకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలి శాఖ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సాయిరాం, కార్యదర్శి మునిరావు, అడ్వైజర్ బోర్డు సభ్యులు రంగారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఆకేపాటి వెంకటరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో విజయం

రామాపురం/గాలివీడు, ఏప్రిల్ 11: మండలంలోని టీడీపీ శ్రేణులు ఏకతాటిపై వచ్చారని,అందరి సహకారంతో తాను విజయం సాధిస్తానని రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. రామాపురం మండలంలోని హస్నాపురంలోని కొండవాడ్లపల్లిలో గురువారం సాయంత్రం టీడీపీ నాయకులను, కార్యకర్తలను సంప్రదించారు. పలు గ్రామాల ప్రజలు, కార్యకర్తలు ఆయనకు పూలమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ తనను రాయచోటి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గం అంతా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగసుబ్బారెడ్డి, సహదేవరెడ్డి, భవనం వెంకట్రామిరెడ్డి, పెంచల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్రంలోని అన్నివర్గాల వారికి సమన్యాయం జరుగుతుందని మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం మండలంలోని ఆరవిడి పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి సైకిలు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

ప్రమాదవశాత్తు పొలం కటవకు నిప్పు

● అప్రమత్తమైన గ్రామస్తులు, పోలీసులు



మంటలు ఆర్పివేస్తున్న పోలీసులు, ప్రజలు

సిద్దవటం, ఏప్రిల్ 11: మండల కేంద్రమైన సిద్దవటం దిగువపేట బద్వేలు రహదారి చర్చి వద్ద ప్రమాదవశాత్తు సుబ్బరాయుడు అనే రైతుకు చెందిన పొలం కటవకు నిప్పు అంటుకొని ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజల సహకారంతో మంటలు అదుపు చేశారు. మంటలు ఎలా వ్యాపించాయనేది తెలియాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొరముట్ల హటావో.. కోడూరు బచావో...



పథకాలు వివరిస్తున్న ముక్కా కుటుంబసభ్యులు

రైల్వేకోడూరు (రూరల్), ఏప్రిల్ 11: కొరముట్ల హటావో.. కోడూరు బచావో నినాదంతో ఉమ్మడి కూటమి నాయకులు గురువారం ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. బాబు సూపర్ సిక్స్ డోర్ టు డోర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని రెడ్డివారిపల్లి, గాంధీనగర్, గుండాలపల్లె, సింగిరివారిపల్లెలో టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి, యువ నాయకుడు ముక్కా సాయివికాస్ సతీమణి శిరీష ఆధ్వర్యంలో రైల్వేకోడూరు కూటమి అభ్యర్థి అరవ శ్రీధర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు వచ్చే పథకాల గురించి క్షుణ్ణంగా వివరించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాయపాటి అజయ్ జైపాల్‌నాయుడు, సుబ్బారెడ్డి, రాగిపాటి విజయ్, పగడాల అంజన్‌కుమార్, సాయం శ్రీధర్, బండ్ల మహేంద్ర, పగడాల మణి, పూల రఘు, నల్లంశెట్టి పెంచలయ్య, గోపి, భరత్, లోకేష్, సుధీర్, సుమంత్, మహేష్, కిషోర్, శ్రీనాథ్, శింగిరి మణి తదితరులు పాల్గొన్నారు.

పన్నులు ఒకేసారి చెల్లించే వారికి 5 శాతం రాయితీ

పులివెందుల టౌన్, ఏప్రిల్ 11: పులివెందుల పట్టణంలో ఆస్తిపన్ను, ఖాళీ జాగా పన్నులను ఏప్రిల్ నెలాఖరులోపు ఏకమొత్తంగా చెల్లించే వారికి పన్నుపై 5శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'షర్మిల పర్యటనను విజయవంతం చేయండి'

పులివెందుల టౌన్, ఏప్రిల్ 11: పులివెందుల నియోజకవర్గంలో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి శుక్రవారం నిర్వహించనున్న పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వేంపల్లెలో 10:30గంటలకు, వేములలో 12:30కు బస్సు యాత్ర ఉంటుందని, అనంతరం పులివెందులలో 4 గంటల వరకు విరామ సమయం ఉంటుందని, 4:30గంటలకు లింగాల మండల కేంద్రంలో, 5:30 గంటలకు సింహాద్రిపురం, పులివెందులలోని 6:30గంటల నుంచి 9 వరకు బస్సు యాత్ర ఉంటుందన్నారు. ఈ యాత్రను కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

● ముగిసిన ఉపవాస దీక్షలు
● ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్న పలువురు నాయకులు



రాయచోటి పట్టణం పాత రాయచోటి వద్దనున్న ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు



ఒంటిమిట్టలో... ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రాజంపేట ఈద్గాలో శుభాకాంక్షలు తెలుపుతున్న బాలసుబ్రమణ్యం



చిట్వేలి ఈద్గాలో ముస్లింల ప్రార్థనలు

రాయచోటిటౌన్/ రాజంపేట/ గాలివీడు/ లక్కిరెడ్డిపల్లె, సంబేపల్లి/ రామాపురం/ చిట్వేలి/ ఒంటిమిట్ట /పెనగలూరు/ నందలూరు/ సిద్దవటం, ఏప్రిల్ 11: నెలరోజుల కఠోర ఉపవాస దీక్షల అనంతరం రంజాన్ పండుగను ముస్లింలు వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల వస్త్ర దానం, అన్నదానం నిర్వహించారు. గురువారం ఉదయం నుంచే ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలువురు రాజకీయ నేతలు ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో గల పాతరాయచోటి సమీపం మాండవ్య నది ఒడ్డున ఉన్న ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈద్గాహ్ కమిటీ, మున్సిపల్, పోలీసు తదితర శాఖల అధికారులు, సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. కాగా ఈ ప్రార్థనల్లో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. అంతేకాకుండా మండల పరిధిలోని శిబ్యాల, గొర్లముదివేడు, కాటిమయ్యకుంట, ఏపీలవంకపల్లె, మాధవరం, రాయుడు కాలనీ, శుభక్తుల్లా కాలనీ, గుండిమడుగు తదితర ప్రాంతాల్లోనూ ప్రార్థనలు చేశారు.

రాజంపేట ఈద్గాలో ప్రార్థనలు

రాజంపేటలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే ఇంటిలో నమాజ్ చేసుకొని తదనంతరం ఈద్గాలకు వెళ్లి ఒకరినొకరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ఈద్గాకు వెళ్లి ముస్లింలను ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, టీడీపీ మైనార్టీ నాయకులు అబుబకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇక గాలివీడు మండలంలోని గాలివీడు, నూలివీడు, అరవీడు, గొట్టివేడు, గోరం చెరువు తదితర గ్రామాల్లో రంజాన్ పండుగను జరుపుకున్నారు. కాగా బోరెడ్డిగారిపల్లె మాజీ సర్పంచ్ మహ్మద్‌రఫీ కుటుంబ సభ్యులు మహిళలందరికీ వస్త్రాలను పంపిణీ చేశారు. లక్కిరెడ్డిపల్లె మండలంలోని లక్కిరెడ్డిపల్లె, చింతకుంటవాండ్లపల్లె, పెద్దపల్లి, దిన్నేపాడు, పందిళ్లపల్లె, దప్పేపల్లెలోని మసీదుల్లో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రార్థనలు నిర్వహించుకున్నారు. సంబేపల్లి మండలంలో గురువారం ముస్లింలు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఉపవాసంతో ఈద్గాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రార్థనలు చేశారు. రామాపురంలోని గువ్వలచెరువు, నీలకంఠ్రావుపేట, గాజులపేట, దూదేకులపల్లి, రామాపురం, బండపల్లి తదితర గ్రామాల్లో గురువారం రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిట్వేలి మండలంలో ఉన్న నాలుగు మసీదులలో జామియా మసీదు, మదీనా మసీదు, నగిరిపాడు, తిమ్మాయపాలెంలోని మసీదులను రంగవల్లులతో ముస్తాబు చేసి కొత్త విద్యుత్ దీపాలతో నెలపొడవునా అంగరంగ వైభవంగా ముస్తాబు చేశారు. ఒంటిమిట్ట మండల పరిధిలోని మలకాటిపల్లె వద్ద ఉన్న మదరసాలో హజరత్ సుభాన్‌బాష ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించి పేదలకు అన్నదానాన్ని నిర్వహించారు. రాచపల్లి, నరసన్నగారిపల్లె, కోనరాచపల్లె గ్రామాల్లో పెద్దఎత్తున రంజాన్ వేడుకలు నిర్వహించారు. పెనగలూరు మండలంలోని చక్రపేట, ఓబిలి, కొత్తపల్లి, నాయుడు వారిపల్లె ఈద్గాల వద్ద గురువారం ముస్లిం, మైనారిటీ ప్రజలు ఘనంగా సామూహిక ప్రార్థనలు నిర్వహించుకున్నారు. మసీదు మత గురువు హజరత్ మెహపీర్, రెహమాన్ మహమ్మద్ ఆధ్వర్యంలో ఖుర్‌ఆన్ లోని అల్లా ప్రవక్త మానవాళికి ఉపదేశించిన సందేశాన్ని వినిపించారు. నందలూరు మండలంలోని ముస్లింలు ఘనంగా ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పండుగను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సిద్దవటం మండలంలోని శివారు ఈద్గా, తురకపల్లె మసీదు వద్ద గురువారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాగా కడప టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి మాధవిరెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు.



గాలివీడులో వస్త్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం



సిద్దవటం ఈద్గా మైదానంలో..



పెనగలూరు మండలం చక్రంపేట ఈద్గాలో...



లక్కిరెడ్డిపల్లెలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే



రాయచోటిలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కమిషనర్, తదితరులు, లక్కిరెడ్డిపల్లెలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

● మున్సిపల్ కమిషనర్ వాసుబాబు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 11: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని, ఆయన అడుగుజాడల్లో మనమందరం పయనిద్దామని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు పిలుపునిచ్చారు. పూలే జయంతి సందర్భంగా గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని మాసాపేట బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన పూలే విగ్రహానికి ప్రత్యేక పూలతో అలంకరణ చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కులవివక్షపై పూలే ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఆయన పోరాటాల ఫలితంగానే బడుగు, బలహీన వర్గాలకు హక్కులు వచ్చాయని, అలాగే దేశంలో కులవివక్షను రూపుమాపినట్లు తెలిపారు. అలాగే రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యులు దిన్నెపాడు రవి, బీసీ నాయకులు భాస్కర్, నాగేశ్వరరావు, శ్రీరాములు తదితరులు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని తహసీల్దారు కార్యాలయానికి సమీపంలో గల అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద ఎంఆర్‌పీఎస్ నాయకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జున, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ నాయకులు టి.ఈశ్వర్, పౌర హక్కుల సంఘం నాయకులు రెడ్డయ్య, లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులు శంకర్‌నాయక్, రెడ్డినాయక్, రజక సంఘం నేతలు రమేశ్‌బాబు, శ్రీనివాసులు, వడ్డెర సంఘం నాయకులు మారుతిశంకర్, జీవానందం, మాలమహానాడు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్ పేర్కొన్నారు. పూలే జయంతి సందర్భంగా లక్కిరెడ్డిపల్లెలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాకిరణం, సామాజిక న్యాయం కోసం పోరాటం చేసి బడుగుల ఆశాజ్యోతిగా నిలిచిన గొప్ప మహానుభావుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో సెల్వరాజు మాట్లాడుతూ పూలే గొప్ప సంఘసంస్కర్త, అభ్యుదయ భావాలు కలవారన్నారు. ఈ కార్యక్రమంలో దప్పేపల్లె సర్పంచ్ కేశవయ్య, బీసీ సంఘం నాయకులు రవి ఆచారి, అశోక్, బసయ్య, భాస్కరరెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

నందలూరు: ప్రముఖ సంఘ సంస్కర్త జ్యోతిరావుపూలే 197వ జయంతి వేడుకలను నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని ఆర్అండ్‌బీ అతిథి గృహ ఆవరణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళ లోకోద్ధరణకు కృషి చేసిన మహా వ్యక్తి పూలే అని, అణగారిన వర్గాల అభ్యున్నతి కొరకు ఎంతో కృషి చేసి వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుర్రా మణియాదవ్, దాసరి నరసింహులు, గురు ప్రసాద్, ఉప్పుశెట్టి సుధీర్, మోడపోతుల రాము, తాటి సుబ్బరాయుడు, సునీల్ రెడ్డి, బద్రి సూరి, గుండు సురేష్, కానకుర్తి వెంకటయ్య, చంద్ర, పాటూరు రమేష్, చామంచి పెంచలయ్య, గండికోట కృష్ణ, బోదనపు త్యాగరాజు, మంట మారయ్య, సుబ్బారెడ్డి, బుర్ర సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనసేన అభ్యర్థి గెలుపు తథ్యం

● టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు(రూరల్), ఏప్రిల్ 11: ఉమ్మడి కూటమి జనసేన అభ్యర్థి శ్రీధర్ గెలుపు తథ్యమని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. గురువారం రాఘవరాజుపురం పంచాయతీలో ఉన్న టీడీపీ కార్యాలయంలో చిట్వేలి మండల నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరం భేదాభిప్రాయాలు పక్కన పెట్టి కలిసికట్టుగా ఉమ్మడి అభ్యర్థి విజయం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. బూతు లెవల్లో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ తమ అభిప్రాయాలను తెలపాలని కోరారు. పార్టీ అధిష్ఠానం మేరకు జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్వేలి మండల సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేమన సతీష్‌తో పలువురు టీడీపీ నేతల భేటీ

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 11: మండలంలోని బొమ్మవరం కమ్మపల్లి గ్రామంలో ఒక కార్యక్రమంలో భాగంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ తానా ప్రెసిడెంట్ వేమన సతీష్‌తో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, రాయచోటి టీడీపీ నియోజకవర్గ నాయకులు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్, బి.కమ్మపల్లి టీడీపీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గం, పార్లమెంటు, రైల్వేకోడూరు అసెంబ్లీ అభ్యర్థి గెలుపునకు సంబంధించిన విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బి.కమ్మపల్లె మాజీ సర్పంచ్‌లు రామకృష్ణనాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, రైల్వేకోడూరు జనార్ధన్‌నాయుడు, చప్పిడి రమేష్‌బాబు, మహేష్‌బాబు, మాజీ సింగిల్‌విండో సభ్యుడు వేమన సుబ్రమణ్యంనాయుడు, వేమన రాజానాయుడు, పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, టీడీపీ యువత రాష్ట్ర నాయకుడు చిగురుపాటి ధనుంజయ నాయుడు, టీడీపీ నాయకులు దుగ్గినేని చంద్రబాబు నాయుడు, రాజంపేట రూరల్ మండల అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు తదితరులు హాజరయ్యారు.



టీడీపీ నాయకులతో తానా మాజీ ప్రెసిడెంట్

రాజకీయ లబ్ధి కోసమే పోలింగ్ కేంద్రం మార్పు

రైల్వేకోడూరు(రూరల్), ఏప్రిల్ 11: రాజకీయ లబ్ధి కోసమే మండలంలోని జంగిటవారిపల్లె ఎంపీపీ స్కూల్‌లో ఉన్న 104 పోలింగ్ కేంద్రం పక్క గ్రామానికి మార్చారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉన్న స్కూల్ బిల్డింగ్ కూల్చేసి పోలింగ్ కేంద్రం మార్చడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంపై ఎన్నికల అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ఎన్నికలు బహిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని గ్రామస్తులు హెచ్చరించారు.

ఘనంగా అవధూతేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు

కడప (కల్చరల్), ఏప్రిల్ 11: కడప నగరం పాతబస్టాండు వద్ద వెలసిన అవధూతేంద్ర స్వామి జ్ఞాన మందిరం, 46వ ఆరాధన మహోత్సవాలు గురువారం కమిటీ అధ్యక్షుడు జి.వి.రమణ సారథ్యంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4 నుంచి 5 గంటల వరకు స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు. 5 గంటల నుంచి స్వామివారు భక్తులకు దర్శనం ప్రారంభించారు. స్వామి వారి భక్తులకు కుర్లి చిన్నసుబ్బరాయుడు, సుబ్బలక్షుమ్మ ఆధ్వర్యంలో సుమారు 4 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర ప్రముఖులు వి.వి.ఎస్. మూర్తి హాజరయ్యారు. సాయంత్రం 7 గంటలకు స్వామివారిని నగర పురవీధులలో ఊరేగించారు. రాత్రి 8 గంటలకు అన్నమయ్య కీర్తనలు, హరికథా కాలక్షేపం కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి శేషాద్రి, ట్రెజరర్ చంద్ర, రాజు, శ్రీనివాసులు, పలువురు స్వామివారి భక్తులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి ఘన స్వాగతం

● టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు సాయిలోకేశ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం

● బలిజపల్లె గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

రాజంపేట, ఏప్రిల్ 11: మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ పార్లమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి గురువారం బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంటు బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ ఆధ్వర్యంలో పార్లమెంటు కార్యాలయంలోని తన అతిథి గృహంలో ఆత్మీయ సమావేశం నిర్వహించి అందరికీ విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకులు పోలి సుబ్బారెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు నాగా సుధాకర్‌రెడ్డి, మాజీ ఆర్టీసీ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, మైనార్టీ నాయకులు షబ్బీర్ అహమ్మద్, న్యాయవాది సింగంశెట్టి రవీంద్ర, రాజంపేట పార్లమెంటు పరిధిలోని బీజేపీ నాయకులు, టీడీపీ నాయకులతో నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యంతో ప్రత్యేకంగా రాజకీయ మంతనాలు నిర్వహించారు.

బలిజపల్లె గంగమ్మ జాతరలో పాల్గొన్న నేతలు

రాజంపేట పట్టణం బలిజపల్లె గంగమ్మ జాతర సందర్భంగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, సుగవాసి బాలసుబ్రమణ్యం, పోలి సుబ్బారెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, హరి ట్రేడర్స్ అధినేత గుగ్గిళ్ల హరిప్రసాద్‌ల ఆధ్వర్యంలో నేతలకు ఘనంగా స్వాగతం పలికి నేతలకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు.



మంతనాలు జరుపుతున్న నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

మళ్లీ 40 డిగ్రీలు దాటిన ఎండ



నిర్మానుష్యంగా వున్న గాంధీ సర్కిల్ బస్టాప్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 11: జిల్లాలో మళ్లీ ఎండ కాస్త పెరిగింది. గురువారం రెండు మండలాల్లో 40కిపైగా డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన విషయం తెలిసిందే. గురువారం నాటికి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నింద్రలో 40.5, తవణంపల్లెలో 40.0 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. మండలాల వారీగా.. నగరిలో 39.2, విజయపురంలో 39.2, శ్రీరంగరాజపురంలో 39.0, బంగారుపాళ్యంలో 38.9, పులిచెర్లలో 38.7, గుడుపల్లెలో 38.5, పుంగనూరులో 38.3, కుప్పంలో 38.3, పెద్దపంజాణిలో 38.2, సోమలలో 38.2, వెదురుకుప్పంలో 38.2, సదుంలో 38.0, చౌడేపల్లిలో 37.7, రొంపిచెర్లలో 37.7, పాలసముద్రంలో 37.6, గుడిపాలలో 37.5, చిత్తూరులో 37.4, గంగవరంలో 37.4, కార్వేటినగరంలో 37.3, శాంతిపురంలో 37.3, గంగాధరనెల్లూరులో 37.0, పలమనేరులో 36.8, పెనుమూరులో 36.8, యాదమరిలో 36.7, వి.కోటలో 36.4, ఐరాలలో 35.9, పూతలపట్టులో 35.8, బైరెడ్డిపల్లెలో 35.7, రామకుప్పంలో 35.5 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వరసిద్ధుడి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



సుప్రీంకోర్టు న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 11: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీటీ రవికుమార్, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశోక్.ఎస్ కినాగి ఉన్నారు. వీరు స్వామిని విడివిడిగా దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వారిని వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఇన్‌చార్జి డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఆలయ సూపరింటెండెంట్ వాసు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్‌ఐ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుకుంది మేమే..

అయినా పూర్తి వివరాలు తెలియదు

కోడి పందేల వ్యవహారంపై పోలీసుల మాట



పట్టుబడ్డ వారిని మీడియాకు చూపుతున్న సీఐ, సిబ్బంది

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 11: 'కోడిపందేల స్థావరంపై దాడిచేసి పట్టుకుంది మేమే. అయితే వారి వివరాలు మాత్రం మాకు ఇంకా తెలియదు' అని పోలీసులు చెప్పుకొచ్చారు. గంగాధరనెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లె గ్రామానికి సమీపంలో గురువారం కొంతమంది వ్యక్తులు కోడి పందేలు ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు సీఐ శంకర్ తన సిబ్బందితో కలిసి కోడి పందేల స్థావరంపై దాడిచేశారు. అక్కడ డబ్బు, కోడిపుంజులు, ద్విచక్ర వాహనాలు, పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకుని ఫొటో దిగారు. వీరందరినీ సాయంత్రం 5.30 గంటలకు తీసుకువచ్చారు. ఈ కేసు విషయంపై గురువారం రాత్రి 9.12 గంటలకు సీఐ శంకర్‌కు ఫోన్‌చేసి వివరాలు అడగ్గా.. ఏడు పందెం కోళ్లు, రూ.11వేల నగదు, 6 ద్విచక్ర వాహనాలు, 6 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తుల పేర్లు మాత్రం ఇంకా తెలియదని సీఐ పేర్కొన్నారు. సుమారు 4గంటలకు పైగా స్టేషన్‌లో పందెం రాయుళ్లను పెట్టుకున్నప్పటికీ వారి గురించి వివరాలు తెలియదని చెప్పడం గమనార్హం.

శిలాఫలకంపై ఫొటోలు, రాతల తొలగింపు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కుప్పం, ఏప్రిల్ 11: కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ కనమపచ్చార్లపల్లెలో జగనన్న కాలనీ పేరుతో వేసిన శిలాఫలకంపై ఉన్న రాతలు, ఫొటోలను రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. ఈ శిలాఫలకంపై సీఎం ఫొటోతోపాటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌ల ఫొటోలు ఉండేవి. దీనిపై 'అధికారులకు కనబడలేదా?' అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతి పత్రికలో గురువారం వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి శిలాఫలకంపై ఉన్న ఫొటోలతోపాటు రాతలను కూడా తొలగించారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై వైసీపీ శ్రేణుల దాడి



తనపై దాడికి ఉపయోగించిన రోకలిబండను చూపుతున్న బేబి షాలిని

తొట్టంబేడు, ఏప్రిల్ 11: అంగన్‌వాడీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసిన సంఘటన శ్రీకాళహస్తి మండలంలోని ఎంపేడు గ్రామం ఈశ్వరయ్య కాలనీలో గురువారం చోటుచేసుకుంది. బాధితురాలు బేబి షాలిని, ఆమె సోదరి విజయమ్మ కథనం మేరకు.... ఏర్పేడు మండలం చింతలపాళెం గ్రామం మరాఠీపురం నక్కలకాలనీలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న బేబి షాలిని ఈశ్వరయ్య కాలనీలో వుంటున్న తల్లిదండ్రుల వద్ద కుమారుడితో ఉంటోంది.వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీలకు చేసిన అన్యాయంపై అప్పుడప్పుడూ బంధువులతో మాట్లాడేది.దీంతో ఆమెను టీడీపీ సానుభూతిపరురాలిగా భావించిన వైసీపీ కార్యకర్తలు శత్రుభావంతో వుండేవారు. గురువారం బేబి షాలిని ఒంటరిగా ఇంటి వద్ద వుండడం గమనించి డబ్బారాధిక, రానా నవిత, డబ్బా చరణ్, కొండి, సారయ్య తదితరులు 20మందికి పైగా విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారు.ప్రస్తుతం బేబి షాలిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.ఈ విషయమై శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌ని అడగ్గా వారంతా బంధువులేనన్నారు. దాడిలో ఇరువర్గాలకూ గాయాలైనట్టు పేర్కొన్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీఈవో గారూ...

ఫిర్యాదులపై చర్యలేవీ?

నేడు తిరుపతిలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి పర్యటన



తిరుచానూరు పద్మావతీ దేవి దర్శనానంతరం ఆలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా దంపతులు

తిరుపతి, ఆంధ్రజ్యోతి: తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో వెలుగు చూసిన అక్రమాలపైన దర్యాప్తు నత్తనడకన సాగుతోంది. పాత్రధారుల్లో కొందరు సస్పెండ్ కాగా సూత్రధారులెవరన్నది దర్యాప్తు అధికారులు ఇంకా తేల్చలేదు. దీంతో అధికారులతో అక్రమాల ఆట ఆడించిన తెర వెనుక వ్యక్తులు దర్జాగా తిరుగుతున్నారు. అప్పటి ఎన్నికల్లో అక్రమాలకు అవకాశమిచ్చిన ఓటర్ల జాబితాలోని 38 వేల ఆబ్సెంట్ ఓటర్ల పేర్లు ఇంకా తొలగించనే లేదు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి నియోజకవర్గాలలో పలు అవకతవకలు, ఉల్లంఘనలు చోటు చేసుకున్నాయి. దీనిపై అసంఖ్యాకంగా ఈసీకి ఫిర్యాదులందాయి.ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో పనిచేస్తున్న పలువురు అధికారులపై నేతల నుంచీ ఆరోపణలు వస్తుండగా జనంలోనూ అనుమానాలున్నాయి. రేణిగుంటలో ఇటీవల పట్టుబడిన ఎన్నికల తాయిలాలకు సంబంధించి అధికారులు దాగుడు మూతలాడుతున్నారు. టీటీడీ పాలక మండలి ఛైర్మన్ మీద, ఈవో మీద అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా ఇంతవరకూ ఎలాంటి చర్యలూ లేవు.ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం తిరుపతికి చేరుకున్న రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లపై కాసేపు అధికారులతో సమీక్షించారు.శుక్రవారం మహిళా వర్సిటీలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆయన పరిశీలించనున్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయనున్నారు. తరువాత సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్షించనున్నారు.ఈ సందర్భంగా జిల్లాలో కొంతకాలంగా సంభవించిన ఘటనలు, తాజా పరిణామాలపై ఆయన దృష్టి సారిస్తారని రాజకీయ వర్గాలతో పాటు జిల్లా ప్రజానీకం కూడా ఆశిస్తున్నారు.

ఓటర్ల జాబితా నుంచీ తొలగని 38 వేల ఓటర్ల పేర్లు

తిరుపతి ఉప ఎన్నికల్లో స్థానికంగా నివాసం లేని 38 వేల ఓటర్లను అధికార పార్టీ నేతలు గుర్తించి వారి పేరిట అక్రమాలకు పాల్పడిన నేపథ్యంలో ఆ పేర్లను ఇంతవరకూ జాబితా నుంచీ తొలగించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈసీ ఓటర్ల జాబితాలో ఈ 38 వేల ఓటర్లనూ గుర్తించింది. ఆ వివరాలు పూర్తిగా ఈసీ వద్ద వున్నాయి. వారు వాస్తవంగా ఓటర్లా, తిరుపతిలోనే నివాసముంటున్నారా అన్నది తేల్చడం పెద్ద సమస్య కాదు. బీఎల్వో స్థాయి నుంచీ ప్రభుత్వానికి విస్తృత యంత్రాంగం వుంది. బూత్ స్థాయిలో బీఎల్వో పరిశీలిస్తే తేలిపోతుంది. అదీ కాకుంటే ఆ ఇంటి అడ్రసుతో నోటీసులు పంపితే ఓటర్లు స్వీకరించి సమాధానం ఇవ్వాలి.ఆ ప్రక్రియలోనూ వాస్తవాలు తేలుతాయి. అయితే ఈ ఓటర్ల ఆచూకీ లేదని సమాచారం. అంటే నిజంగా వారు తిరుపతి నుంచీ ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోయి వుండాలి. ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు తరలిపోయి వుండాలి. అది కాదంటే అధికార పార్టీ నేతలు చేర్పించిన దొంగ ఓటర్లయినా వుండాలి. ఇందులో ఏ ఒక్కటి నిజమైనా ఆ పేర్లను జాబితా నుంచీ తొలగించాలి. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం నోరు మెదపడం లేదు. ఇంత జరిగినా ఆ పేర్లు జాబితాలో కొనసాగుతుంటే ఈసీ మార్గదర్శకాలకు అర్థమే లేదు.

రేణిగుంటలో పట్టుబడిన తాయిలాలపై దాగుడుమూతలు

రేణిగుంటలో ఇటీవల నాలుగు ప్రైవేటు గోదాముల్లో రూ. కోట్ల విలువైన వైసీపీ ప్రచార సామగ్రి పట్టుబడింది. దానిపై పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అయితే ఈ వ్యవహారం కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా మారింది. పట్టుబడిన వైసీపీ ప్రచార సామగ్రిలో చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన ఇద్దరు అధికార పార్టీ నేతల ఫొటోలు, పేర్లతో కూడిన పలు వస్తువులు లభించాయి. అవన్నీ ఓటర్లకు పంపిణీ చేయాల్సిన తాయిలాలు. పార్టీ ప్రచార సామగ్రి అంటే పార్టీ చిహ్నాలతో కూడిన జెండాలు, టోపీలు, బ్యానర్లు, స్టిక్కర్లు వుంటాయి. అంతవరకూ అభ్యంతరం లేదు. కానీ మహిళలు పెట్టుకునే బొట్టు బిళ్ళలు, చీరలు, రిస్టు వాచీలు, లౌడ్ స్పీకర్లు, వాటి స్టాండ్లు వంటివి నిస్సందేహంగా ఓటర్లకు పంపిణీ చేసేందుకు ఉద్దేశించినవే. స్పీకర్లు సాధారణంగా ఆలయాలకు, చర్చిలకు, మసీదులకు అందజేసేవి. ఇవన్నీ తాయిలాలే. నేతల ఫొటోలు, పేర్లు వాటిపై వున్నా సదరు నేతలపై కేసులు నమోదు కాలేదు. కనీసం నోటీసులు కూడా జారీ చేయలేదు. గోదాములను అద్దెకు తీసుకున్నది కూడా అధికార పార్టీ అవసరాల కోసమే. నేతలను వదిలిపెట్టి గోదాముల నిర్వాహకులపై కేసు పెట్టి చేతులు దులుపుకున్నారు.

టీటీడీ ఛైర్మన్, ఈవోల మీద ఫిర్యాదుల వెల్లువ

సార్వత్రిక ఎన్నికల వేళ టీటీడీ పాలకమండలి ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డిపై, ఈవో ధర్మారెడ్డిపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారనేది వారిపై ప్రధాన ఆరోపణ. ఛైర్మన్ కుమారుడు అభినయ్‌రెడ్డి తిరుపతిలో అధికార పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నేపథ్యంలో అతడికి అనుకూలంగా ఇటీవలి కాలంలో పలు నిర్ణయాలు తీసుకున్నారని ఇప్పటికే బీజేపీ, జనసేన, టీడీపీ నేతలు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేశారు. టీటీడీకి చెందిన వేలాదిమంది ఉద్యోగులు,వారి కుటుంబీకులు తిరుపతి నియోజకవర్గంలో ఓటర్లుగా వున్న సంగతి తెలిసిందే. ఐదువేల మందికి పైగా ఉద్యోగులకు ఇళ్ళ స్థలాల కేటాయింపు, మరికొన్ని వేలమందికి వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత కల్పించడం వంటి నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే టీటీడీ నిధులతో నగరంలో రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఇవన్నీ నగర ఓటర్లను ప్రభావితం చేసేవే. కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి తమ పదవి, ఉద్యోగాలను అడ్డం పెట్టుకుని అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడాన్ని అడ్డుకోవాలని, వారిని ఆయా స్థానాల నుంచీ తొలగించాలని ఈసీకి ఫిర్యాదులు అందుతున్నాయి. టీటీడీ ఉద్యోగులు పలువురు అధికార పార్టీ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో బహిరంగంగా పాల్గొన్నా చర్యల్లేవు.

చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి అధికారులపైనా ఆరోపణలు, అనుమానాలు

చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల పరిధిలో కింది స్థాయి ఉద్యోగులు మొదలుకుని పై స్థాయి అధికారుల వరకూ పలువురిపై ఆరోపణలు, అనుమానాలు వున్నాయి. వారంతా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. అధికార పార్టీ నేతల ఒత్తిడితో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు అడ్డంకులు సృష్టిస్తున్నారని, వైసీపీ నేతల కోడ్ ఉల్లంఘనలను చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని వీరిపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఓటర్ల జాబితాలలో తప్పులను సరిదిద్దాలని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా బీఎల్వోల నుంచీ ఈఆర్వోల దాకా పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి.జిల్లా పర్యటనలో వున్న సీఈవో ముకేష్ కుమార్ మీనా వీటన్నింటిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సి వుంది. లేనిపక్షంలో ఈసీ నిబంధనలకు, మార్గదర్శకాలకు అర్థమే లేకుండా పోతుందన్న అభిప్రాయం జనంలో ఏర్పడే ప్రమాదముంది.తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో పలు అక్రమాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి ఓటర్ల జాబితాలో స్థానికంగా నివాసం లేని 38 వేల మంది ఓటర్లను గుర్తించి అధికార పార్టీ నేతలు కొందరు భారీ అక్రమానికి పాల్పడ్డారు. అందులో 35 వేల ఓటరు కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేశారు. వాటికి డూప్లికేట్ కార్డులు తయారుచేశారు. అందులో ఓటరు ఫొటోలు మార్చారు. వాటి సాయంతో దొంగ ఓట్లు భారీగా వేయించారు. ఫిర్యాదులు రావడంతో స్పందించిన ఈసీ విచారణ జరపగా నిజమని తేలింది. ఐఏఎస్ అధికారి సహా పలువురు దిగువ స్థాయి అధికారులు సస్పెండయ్యారు. క్రిమినల్ కేసు కూడా నమోదైంది. కాకపోతే ఈ అక్రమానికి అసలు కారకులెవరన్నది బహిరంగరహస్యమైనా వారిని బాధ్యులుగా గుర్తించే దిశగా దర్యాప్తు సాగలేదు. అర్థాంతరంగా ఆగిపోయింది. దీంతో బాధ్యులైన అసలు వ్యక్తులు దర్జాగా ప్రజా జీవితం గడుపుతున్నారు.

తిరుపతి ఉప ఎన్నికల అక్రమాలపై నత్తనడకన దర్యాప్తు

తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో పలు అక్రమాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి ఓటర్ల జాబితాలో స్థానికంగా నివాసం లేని 38 వేల మంది ఓటర్లను గుర్తించి అధికార పార్టీ నేతలు కొందరు భారీ అక్రమానికి పాల్పడ్డారు. అందులో 35 వేల ఓటరు కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేశారు. వాటికి డూప్లికేట్ కార్డులు తయారుచేశారు. అందులో ఓటరు ఫొటోలు మార్చారు. వాటి సాయంతో దొంగ ఓట్లు భారీగా వేయించారు. ఫిర్యాదులు రావడంతో స్పందించిన ఈసీ విచారణ జరపగా నిజమని తేలింది. ఐఏఎస్ అధికారి సహా పలువురు దిగువ స్థాయి అధికారులు సస్పెండయ్యారు. క్రిమినల్ కేసు కూడా నమోదైంది. కాకపోతే ఈ అక్రమానికి అసలు కారకులెవరన్నది బహిరంగ రహస్యమైనా వారిని బాధ్యులుగా గుర్తించే దిశగా దర్యాప్తు సాగలేదు. అర్థాంతరంగా ఆగిపోయింది. దీంతో బాధ్యులైన అసలు వ్యక్తులు దర్జాగా ప్రజా జీవితం గడుపుతున్నారు.

రాజకీయాలను హుందాగా చేయడమే మా నైజం

వలంటీర్లకు మంచి భవిష్యత్తు అందిస్తామన్న అమర్



వీరప్పల్లెలో మాట్లాడుతున్న మాజీమంత్రి అమరనాథరెడ్డి

పెద్దపంజాణి, ఏప్రిల్ 11: రాజకీయాలను హుందాగా చేయడమే నూతనకాల్వ కుటుంబ నైజమని మాజీమంత్రి అమరనాథరెడ్డి అన్నారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా గురువారం పెద్దపంజాణి మండలం తుర్లపల్లె, వీరప్పల్లె పంచాయతీలలో ఆయన పర్యటించారు. మల్లసముద్రంలోని ముస్లింలతో కలసి రంజాన్ పండుగ జరుపుకొన్నారు. ఇంటింటికి వెళ్ళి తెలుగుదేశం హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించి పార్టీకి అండగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి హయాంనుంచి 50ఏళ్లుగా.. పంచాయతీనుంచి ఢిల్లీ వరకు రాజకీయాలు చేస్తున్నా ప్రజలకు అందుబాటులో ఉన్నామని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో వచ్చి రాజకీయాలు చేసే కుటుంబం తమది కాదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఈ ప్రభుత్వంలో ఆగిన పనులన్నీ పూర్తి చేస్తానన్నారు. వలంటీర్లకు మంచి భవిష్యత్తు అందిస్తామన్నారు. ఇప్పటికే రూ.10 వేల గౌరవ వేతనాన్ని చంద్రబాబు ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. స్వచ్ఛందంగా ప్రజా సేవ చేయాల్సిన వలంటీర్లను ఐదేళ్లు వాడుకుని, తమ స్వార్థ రాజకీయాలకు బలిచేయడం తగదన్నారు. టీడీపీ నాయకులు మురహరిరెడ్డి, సర్పంచ్ పార్వతమ్మ, ఎంపీటీసీ సుబ్రమణ్యం, స్థానిక నియకులు గోపాల్‌రాజు, సుబ్రమణ్యంరాజు, నారాయణరాజు, పురుషోత్తమరాజు, జయరామరాజు,ఆదినారాయణ, గంగప్ప, మనోహర్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పూలే స్ఫూర్తితో ముందుకు..!

- టీడీపీ పాలనలో బడుగులకు సంక్షేమ పథకాలు అమలు చేసిందన్న నేతలు



జ్యోతిరావ్ పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు తదితరులు - జిల్లా టీడీపీ కార్యాలయంలో జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 11: 'సామాజిక అసమానతలకు, అంటరానితనానికి వ్యతిరేకంగా జ్యోతిరావు పూలే అలుపు ఎరగని పోరాటం చేశారు. ఆయన స్ఫూర్తితో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్, అదే బాటలో ప్రస్తుత పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బడుగు బలహీన వర్గాలకోసం అనేక సంక్షేమపథకాలు ప్రవేశపెట్టారు' అని టీడీపీ నేతలు చెప్పారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా గురువారం చిత్తూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతీరావ్ పూలే అని కొనియాడారు. టీడీపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని అన్నారు. అలాగే నగరంలోని పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, లోక్‌సభ పార్టీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, అసెంబ్లీ అభ్యర్థి గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ నేతలు సురేంద్రకుమార్, కోదండయాదవ్, మోహన్‌రాజ్, కటారి హేమలత, కాజూరు బాలాజి, శ్రీధర్‌యాదవ్, కాజూరు రాజేష్, కంద, హేమాద్రి నాయుడు, తలారి రెడ్డెప్ప, శంకర్, ఈశ్వర్, తారక్, గోకుల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 65,570 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,446 మంది తలనీలాలు సమర్పించారు.

ఒంటరి ఏనుగు

విధ్వంసం



ఒంటరి ఏనుగు సంచారంతో టమోటా పంట ధ్వంసం

సోమల, ఏప్రిల్ 11: మండలంలోని చిన్నఉప్పరపల్లె పంచాయతీ వినాయకపురం వద్ద ఒంటరి ఏనుగు బుధవారం రాత్రి సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. వారం క్రితం 16 ఏనుగుల గుంపు పత్రపల్లె, కొత్తూరు, బోనమంద, అన్నెమ్మగారిపల్లె ప్రాంతాల్లో సంచరించి రైతులకు కునుకు లేకుండా చేశాయి. ఈ క్రమంలోనే గుంపులోని ఓ ఏనుగు వినాయకపురం వద్ద సంచరించినట్లు రైతులు తెలిపారు. అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీళ్ల కోసం నిలదీత

పెనుమూరు, ఏప్రిల్ 11: నీళ్ల సమస్యపై వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మిని గురువారం గ్రామస్తులు నిలదీశారు. పెనుమూరు మండలం కంబాలచేను, పుట్టగానిపల్లి గ్రామాల్లో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. దారి సమస్యలు, తాగునీటి సమస్య ఉందని గడప గడపలో మీ నాన్నకి తెలిపామని, ఇంత వరకు పరిష్కరించలేదంటూ ఆమెను నిలదీశారు.

తిరుమలలో గీతాంజలి



అచ్చ తెలుగు హీరోయిన్ అంజలి తాను నటించిన 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రం విడుదల సందర్భంగా గురువారం తిరుమల వెంకన్నను దర్శించుకున్నారు.

అతివేగానికి ముగ్గురు యువకుల బలి



చైతన్య,అజయ్, జగదీష్ (ఫైల్ ఫొటోలు)

తిరుచానూరు/వరదయ్యపాళెం, ఏప్రిల్ 11: అతివేగం కారణంగా జరిగిన రెండు ప్రమాదాల్లో ముగ్గురు యువకుల నిండు ప్రాణాలు గాలిలో కలసిపోయాయి. తిరుచానూరు ఎస్‌ఐ జగన్నాథ రెడ్డి కథనం ప్రకారం... నెల్లూరుకు చెందిన చైతన్య(18) ఐటీఐ పూర్తి చేసి శ్రీకాళహస్తి సమీపంలోని ఓ పరిశ్రమలో అప్రెంటీస్ చేసేవాడు. తిరుచానూరు సమీపంలోని దామినేడు హౌసింగ్‌కాలనీలో గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. గురువారం వేకువజామున దామినేడుకు చెందిన అజయ్(17)తో కలిసి మోటార్ సైకిల్‌పై తిరుపతిలోని లక్ష్మీపురం సర్కిల్‌కు వెళ్లాడు.మరో స్కూటర్‌పై స్థానికంగా ఉన్న వీరి స్నేహితులు భాస్కర్, సందీప్ కూడా టీ తాగడానికి లక్ష్మీపురం సర్కిల్‌కు వచ్చారు. నలుగురూ టీ తాగాక చైతన్య, అజయ్ తిరిగి దామినేడుకు బయలుదేరారు. ఫ్లై ఓవర్ ముగిసే స్థలం వద్ద ఓ కల్యాణ మండపం గేటును వీరు ప్రయాణిస్తున్న స్కూటర్ అతివేగంగా ఢీకొంది.దీంతో ఇద్దరికీతీవ్రగాయాలయ్యాయి. వెనుకే వచ్చిన భాస్కర్, సందీప్ వెంటనే 108అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు.అంబులెన్స్ సకాలంలో రాకపోవడంతో ఆటోలో ఆస్పత్రికి తరలించారు. చైతన్య మార్గమధ్యంలోనే మృతి చెందగా అజయ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు.కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను రుయా మార్చురీకి తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించాక శవాలను బంధువులకు అప్పగించనున్నారు. అజయ్ ఇటీవల పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్ష రాశాడు. వీరి మృతితో రెండు కుటుంబాలూ విషాదంలో మునిగిపోయాయి. కాగా వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరుకుచెందిన జగదీష్ (28) గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. శ్రీసిటీ ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు...చిన్నపాండూరు సమీపంలోని ఏజీఎల్ పరిశ్రమలో పనిచేస్తున్న జగదీష్ గురువారం మధ్యాహ్నం 3గంటలకు బైక్‌లో ఇంటికి వస్తుండగా రాచపాళెం మలుపు కోనాక్షమ్మ ఆలయ సమీపంలో బస్సును ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పి కింద పడిపోయాడు. అక్కడికక్కడే జగదీష్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.జగదీష్ మృతి విషయం తెలిసి 8 నెలల గర్భవతి అయిన ఆయన భార్య దిగ్భ్రాంతికి గురైంది. ఎస్‌ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఈద్-ఉల్-ఫితర్

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 11: మదనపల్లె పట్టణంతోపాటు మండల పరిధిలో గురువారం ఈద్-ఉల్-ఫితర్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని ఈద్గాలో ముస్లింలు సామూహికంగా ప్రార్థనలు చేశారు. వేకువ జామునే ఫజర్ నమాజ్ అనంతరం ముస్లింలు స్థానిక జామీయా మసీదుకు చేరకుని అక్కడి నుంచి బెంగళూరు రోడ్డులోని ప్రధాన ఈద్గాకు ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా మతగురువు, మసీద్ ఇమాం హజరత్ జలాల్ఉద్దీన్ దానధర్మాలకు ప్రతీకగా రంజాన్ పండుగ ప్రతీక అంటూ ధార్మికో పన్యాసం ఇచ్చారు. స్థానిక జామియా మసీదులో మతగురువులు, బసినికొండ ఈద్గాలో ముఫ్తి ఆయా మసీదుల్లో ఇమామ్‌లు ధార్మికోపన్యాసం ఇచ్చారు. బెంగళూరు రోడ్డులోని ఈద్గాలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని నమాజ్ చేశారు. ముస్లింలతో కలిసిఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని బసినికొండ, సీటీఎం, ఆరోగ్య వరం, పోతబోలు, వలసపల్లె, బీకేపల్లె, కురవంక ఈద్గాల్లో గ్రామీణ ముస్లింలు గ్రామ సరిహద్దులోని ఈద్గాలకు జమాత్ రూపంలో ఐక్యతగా వెళ్లి సామూహిక ప్రార్దనలు నిర్వహించారు.

ములకలచెరువులో: మండలంలో శుక్రవారం రంజాన్ పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ములకలచెరువు, బురకాయలకోట, సోంపల్లె, కాలువపల్లె, దేవళచెరువు, కదిరినాధునికోట, వేపూరికోట, చౌడసముద్రం గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రార్ధనలు జరిపారు. ములకలచె రువులో పెద్ద ఎత్తున ముస్లింలు అల్లాహ్‌ను స్మరిస్తూ కలిసికట్టుగా వెళ్లి ప్రార్ధనలు నిర్వహించారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పేదలకు దాన, ధర్మాలు చేశారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలంలో గురువారం రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. పెద్దమండ్యం, కలిచెర్ల, తురకపల్లి, వెలిగల్లు, పాపేపల్లి, గుడిసెవారిపల్లి, గురివిరెడ్డిగారిపల్లి, ముసలికుంట, బండ్రేవులలోని ముస్లింలు ఈద్గాలకు వెళ్లి నమాజ్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బాబాబేగ్, వుసేన్‌సాబ్, సర్పంచ్ బాషా, మాజీ సర్పంచ్ నజీర్ అహ్మద్, ఖాదర్ వలి, చాంద్‌బాషా, ఖాజీ ఎస్ఎండీ ఇస్మాయిల్ తదితర ముస్లిం మత పెద్దలు, హజరత్‌లు పాల్గొన్నారు.

రామసముద్రంలో: రామసముద్రం మండల కేంద్రం, తిరుమలరెడ్డిపల్లె, చెంబకూరు, గొల్లపల్లె, ఊలపాడు గ్రామాల్లో గురువారం ముస్లింలు రంజాన్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా మసీదులు విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండల కేంద్రంలోని దిగువపేట నుంచి శ్రీనివాసపురం రోడ్డులోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.




ములకలచెరువు, గుర్రంకొండలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నిమ్మనపల్లిలో: రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలోని అన్ని మసీదులలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముఖ్యంగా నిమ్మనపల్లి, చల్లావారిపల్లి, ముష్టూరు, తురకపల్లి, సేదాపేట, రాచవేటివారిపల్లి, సాగిబండవారిపల్లిలో ముస్లింలు వారి మసీదుల్లో ప్రార్థనలు జరిపి సమీపంలోని ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకొంటూ ఈద్-ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

తంబళ్లపల్లెలో: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ పర్వదినాన్ని తంబళ్లపల్లె మండలంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల ఉపవాస దీక్షల అనంతరం గురువారం పెద్దలు, చిన్నారులు నూతన వస్త్రాలు ధరించి మసీదు, ఈద్గా వద్దకు వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. తంబళ్లపల్లె మండల కేంద్రంలో ముస్లింలంతా ఈద్గా వద్దకు ర్యాలీగా వెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం గతించిన పెద్దల సమాధు ల వద్దకు వెళ్లి నివాళులర్పించారు.

కురబలకోటలో: మండలంలోని అంగళ్ళు, కురబలకోట, ముదివేడు, నందిరెడ్డిగారిపల్లె,గుట్టమీదసాహెబులపల్లె తదితర గ్రామాల్లో రంజాన్ పండుగ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ప్రార్ధనలు నిర్వహించి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో ఫజురుల్లా, కుళ్ళాయప్ప, హబీబుల్లా, ముస్కీన్‌వల్లీ, నజురుల్లా, మహమ్మద్ పాల్గొన్నారు.

కలకడలో: కలకడ మండలంలో ముస్లింలు రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలకడ, ఎర్రయ్యగారిపల్లి, ఎర్రకోటపల్లి, కోన, బంగారువాండ్లపల్లి తదితర గ్రామాల్లో ఈద్గాల వద్దకు చేరుకుని ప్రార్ధనలు చేశారు. అనంతరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బి కొత్తకోటలో: ఈద్-ఉల్ -ఫితర్ పర్వదినాన్ని బి.కొత్తకోటలో ముస్లింలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ పీఎస్ మనోహర్, పారిశ్రామికవేత్త కొండా నరేంద్ర, రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

గుర్రంకొండలో: రంజాన్ వేడుకలను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్ధనలు చేసి పండుగ శుభాకాంక్షలను తెలుపుకున్నారు. మత గురువుల సందేశాన్ని శ్రద్ధగా ఆలకించారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండల వ్యాప్తంగా గురువారం రంజాన్ సర్వదిన వేడుకలను ముస్లింలు భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. స్థానిక బైపాస్ రోడ్డు, నమాజ్‌కట్ట వీధి ప్రాంతాలలోని ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని నిరుపేదలకు దాన ధర్మాలు చేపట్టారు.

కలికిరిలో: మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం రంజాన్ పర్వదిన వేడుకలను ముస్లింలు భక్తి శ్రద్దలతో వైభవంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఈద్గాల వద్దకు వెళ్లి సామూహిక ప్రార్థనలు నిర్వ హించి మత పెద్దల ప్రవచనాలను శ్రద్ధగా ఆలకించారు. కలికిరి పట్టణంలోని రెండు ఈద్గాల వద్ద పెద్ద సంఖ్యలో ప్రార్థనలకు హాజరయ్యారు. కలికిరి క్రాస్‌రోడ్డు ఈద్గా లోపల స్థలం చాలకపోవడం తో జాతీయ రహదారి పైన ప్రార్ధనలు కొనసాగించారు. కొత్తగజ్జలవారి పల్లె, మేడికుర్తి, గడి, గుండ్లూరు, మహల్, సంగ్రావారిపల్లె, కందుకూ రివాండ్లపల్లె తదితర గ్రామాల్లోని ముస్లింలు సమీపంలోని ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలను నిర్వహించారు.

పెద్దతిప్పసముద్రంలో: మండలంలోని వివిధ గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడులను ఘనంగా నిర్వహించుకున్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు ఆచరించి నేడు పేద, దనిక వర్గాల తారతమ్యం లేకుండా పండుగను జరుపుకున్నారు. ఆయా గ్రామా ల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగను జరుపుకున్నారు. మండలంలోని రంగసముద్రం, పీటీఎం, కందుకూరు, వినసకర్రవాండ్లపల్లె, పులికల్లు, మల్లెల, మద్దయ్యగారి పల్లె, చెన్నరాయునిపల్లె గ్రామాల్లో ముస్లింలు ఆయా మసీదుల్లో ప్రార్థనల అనంతరం ఈద్గాల వద్ద సామూహిక ప్రార్ధనలు చేశారు.

అంటరానితనం నిర్మూలనకు పూలే కృషి : ఆర్డీవో



సబ్‌కలెక్టరేట్‌లో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో హరిప్రసాద్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 11: స్వాతంత్ర్యం రాకమునుపు దేశంలో అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు మహాత్మ జ్యోతిరావు పూలే కృషి ఎనలేనిదని ఆర్డీవో హరి ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం జ్యోతిరావుపూలే 197వ జయంతి సందర్భంగా స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక టమోటా మార్కెట్ వద్ద బహుజన సేన వ్యవస్థాపకుడు శ్రీచందు ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా, వాల్మీకిసంఘం నాయకులు పులి శ్రీనివాసులు, నాగినేని గోవిందు, రాయల్‌బాబు పాల్గొన్నారు. స్థానిక పోర్డు సంస్థ కార్యాలయంలో డైరెక్టర్ లలితమ్మ ఆధ్వర్యంలో, దేవతానగర్‌లోని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. గిరిజమ్మాల్, కవితారాణి, పాల్గొన్నారు.



పూలే విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

పీలేరులో: తొలి సామాజిక విప్లవకారుడైన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని బహుజన సంక్షేమ, బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు ఎ.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ, బహుజన సంక్షేమ, బల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్, నోబుల్ టీచర్స్ అసోసియేసన్, ఎం ఆర్‌పీఎస్, బీసీ చైతన్య సమితి, మాలమ హానాడు, భారతీయ అంబేడ్కర్ సేన, బిస్మిల్లా ఆటో యూనియన్, రాష్ట్ర పంచాయతీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని గురువారం పీలేరులో ఘనంగా నిర్వహించారు. పలువురు నాయ కులు స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయ ఎదురుగా ఉన్న పూలే విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో టీడీపీ నేతలు బండి రామస్వామి, పోలిశెట్టి సురేంద్ర, పురం రామ్మూర్తి, కోటపల్లె బాబు, స్పోర్ట్స్ మల్లి, వసంతాల రాజా, ఊటుకూరి శివారెడ్డి, రెడ్డిముని, భాస్కర, అప్పస్వామి, లక్ష్మీకాంతమ్మ, రమాదేవి, బహుజన సంఘ నాయకులు రాజేంద్ర ప్రసాద్, ఎన్టీఆర్ నఫీస్, రవికుమార్, మాలమ హానాడు నాయకులు జి.రవీంద్ర, తుమ్మల ధరణీ కుమార్, ఎంఆర్‌పీఎస్ నాయకులు గండికోట వెంకటేశ్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు బుక్కే హరినాయక్, బాస్ నాయకులు మల్లిఖార్జున, ముల్లంగి కృష్ణయ్య, నోబుల్ టీచర్స్ నాయకులు పాల్గొన్నారు. కేవీపల్లెలోని టీడీపీ కార్యాలయంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దళిత నేత చంద్రయ్య, ఏపీ ఎం ఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురేశ్, టీడీపీ నేతలు అంజనేయులు, ధనంజయ, నాగరాజ, విశ్వనాథరాజు, రెడ్డప్ప, నాగేశ్వర, నాగముని, కేశవ, బీజేపీ నేత గుణశేఖర్ పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాల్మీకిపురం మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ప్రభుచరణ్, పాఠశాల ప్రిన్సిపాల్ నవమల్లిక, ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలికిరిలో: వెనుకబడిన కులాల ఆరాధ్య దైవం జ్యోతీబా పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని బీసీ నాయకులు పేర్కొన్నారు. పూలే జయంతి సందర్భంగా గురువారం పలు బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలికిరి నాలుగు రోడ్ల కూడలిలో గాంధీ విగ్రహం ముందు పూలే చిత్రపటాన్ని ఆవిష్కరించారు. మండల బీసీ సంఘం నాయకుడు జనార్థన గౌడ్ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు నిజాముద్దీన్, చంద్రశేఖర్, జె.ప్రభాకర, వెంకటపతి, రెడ్డిరాము, జ్ఞానమూర్తి, రెడ్డిశేఖర్, మురళీ గౌడ్, హేమాంబర్, వేణుగోపాల్, గంగరాజు, మేస్త్రీ రాజన్న, పెద్దచంద్ర, చిన్నచంద్ర పాల్గొన్నారు.

కురబలకోటలో: మండలంలోని అంగళ్ళులో రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సదాశివ, బొగ్గుభాస్కర్, సూరి, లక్ష్మన్న, రమేష్, హరి. రాజు, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావుపూలే విగ్రహావిష్కరణ



టమోటా మార్కెట్ వద్ద జ్యోతిరావుపూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బీసీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బోడెం రాజశేఖర్

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 11: స్థానిక నీరుగట్టువారిపల్లెలో మార్కెట్ యార్డు వద్ద బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్ ఆధ్వర్యం బడుగు బలహీన వర్గాల ఆశ్యాజ్యోతి మహాత్మజ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఆటో కార్మికుల సంక్షేమానికి లక్ష రుపాయల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వైవీ శేఖర్‌నాయుడు,నాగినేని గోవిందు,చిన్నరెడ్డెప్ప, అమానుల్లా, నారాయణస్వామి, గురుమూర్తి, సతీష్, బహుజనసేన శ్రీచందు, నాగరాజ, చెన్నకేశవులు, బాబు రాజేంద్రప్రసాద్ రాయల్, రేగడి ప్రసాద్ కుమార్, నాగేంద్రకుమార్, పాల్గొన్నారు. మాలమహానాడు ఆధ్వర్యంలో మలమహానాడు జాతీయ అధ్యక్షుడుయమల సుదర్శనం, గుండాల మనోహర్, చంద్రయ్య, పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వీసీకే పార్టీ నేతలు, బాస్ సంయుక్త ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బాస్ జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు. నేతలు హరీష్, మహేష్, బాలు, సాదిక్, నవీన్, ఆది, శశికుమార్, సుధాకర్, భరత్, సాయికృష్ణ, శంకర పాల్గొన్నారు.

పుష్పపల్లకిలో ఊరేగిన రేణుకా అమ్మవారు



పుష్పపల్లకిలో రేణుకా యల్లమ్మ అమ్మవారు

ములకలచెరువు, ఏప్రిల్ 11: మండలంలోని దేవళచెరువు పంచాయతీ యర్రం రెడ్డిగారిపల్లెలో వెలసిన రేణుకా యల్లమ్మ అమ్మవారు గురువారం పుష్ప పల్లకిలో ఊరేగారు. తిరుణాల ఉత్సవాల్లో భాగంగా బుధ, గురువారాలు అమ్మవారి ఊరే గింపును వైభవంగా నిర్వహించారు. విద్యుద్దీపాలకరణతో బళ్ళారి దప్పు లు, పండరీ భజనలు, పిల్లనగ్రోవి, కోలాటాలు, బాణా సంచా పేలుళ్ళ మధ్య అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని యర్రంరెడ్డిగారిపల్లె, మావళ్ళవా రిపల్లె గ్రామాల్లో ఊరేగించారు. గురువారం మధ్యాహ్నంతో ఊరేగింపు ముగిసింది. దీంతో మూడు రోజులుగా జరుగుతున్న అమ్మవారి తిరుణాల ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జ్యోతి ఉత్సవంలో లడ్డు, చీరలు వేలం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 11: స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీదేవి జ్యోతిఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి లడ్డు, చీరలు వేలం నిర్వహించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు ఉప్పురామచంద్ర, కార్యదర్శి గుండ్లపల్లె ప్రభా కర్, ట్రెజరర్ లోకేష్ ఆధ్వర్యంలో లడ్డు రూ. 9 వేలు వేలంపాటలో ధర పలికింది. అమ్మవారికి సమర్పించిన చీరలను వేలం నిర్వహించారు. అమ్మవారి జ్యోతి ఉత్సవాలు ముగింపు సందర్భంగా అమ్మవారిని భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొని అమ్మవారి చీరలను వేలంపాటలో దక్కించు కున్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం

వాల్మీకిపురం, ఏప్రిల్ 11: వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో కృతికా నక్షత్రం సందర్భంగా గురువారం వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని కళ్యాణ మండపంలో షిరిడీ సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా వళ్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి వారిని కళ్యాణ వేదికపై ముస్తాబు చేసి కల్యాణోత్సవం భక్తిశద్దలతో నిర్వహించారు. ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామి, కార్యసిద్ధి అభయాంజనేయస్వామి, సిద్ది గణపతి, ధ్యాన షిరిడీసాయిబాబా, శనేశ్వరస్వామి, లింగోద్భవ మహాశివున్ని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ అన్న ప్రసాదాలు పంపిణీ చే శారు. ఈకార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు వసంతమ్మ, కోమల, శశికళ, రాధమ్మ, అరుణ, వెంకటేష్ పాల్గొన్నారు.

సింహప్రభ వాహనంపై చౌడేశ్వరిదేవి



కలకడ, ఏప్రిల్ 11: కలకడ మండలం కోనలో వెలసిన చౌడేశ్వరి ఉత్సవాలలో భాగంగా తొగటవీర క్షత్రీయ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారు సింహప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పుష్పపల్లకిని రంగు రంగుల దీపాలతో అలంకరించారు. జ్యోతుల ఊరేగింపు, మంగళవాయిద్యాలు, కేరళ చండీ మేళం, కాట్పాడి వారి బాణసంచా, యువకుల కేరింతలతో కోలాహలంగా అమ్మవారిని ఊరేగించారు. కోనతో పాటు ప్రక్క గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామానికి చెందిన యువకుడు లోకేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించండి



సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 11: రాష్ట్రాభివృద్ధి కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపి కూటమికి ఓటేసి అధిక మెజార్టీతో గెలిపించాలని తంబళ్లపల్లె టీడీపీ నాయకులు ప్రజలను కోరారు. గురువారం గోపిదిన్నె పంచాయతీ ఉప్పులూరివాండ్లపల్లెలో బాబు ష్యూరి టీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు పడాలంటే ఎచంద్రబాబును సీఎం చేసుకోవాలని తంబళ్లపల్లె అన్ని రంగాల్లో అభివృద్ధి కావాలంటే జయచంద్రారెడ్డికి ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ బేరిశీన, బూత్ కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంక టరెడ్డి, సోముశేఖర్, వార్డు సభ్యుడు జగదీష్, జయరాంరెడ్డి, భాస్కర్, హరిప్రసాద్, అంజి పాల్గొన్నారు.

సీనియర్ టీడీపీ నేత ఉత్తమరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



ఉత్తమరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న జయచంద్రారెడ్డి

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 11 : మండలంలోని నవాబుకోట పంచాయతీ బెట్టకొండకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఉత్తమరెడ్డి మృతి చెందడం పార్టీకి తీరని లోటని తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన బెట్టకొండకు చేరుకుని ఉత్తమరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఆయన వెంట మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

17న సీతారాముల కల్యాణం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 11: స్థానిక వరాలాంజనేయస్వామి ఆలయం లో ఈనెల 17న సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి 17వరకు శ్రీరామనవమి మహోత్సవాలు అత్యంతవైభవంగా నిర్వహిస్తునట్లు ఆలయకమిటీ సభ్యులు గురువారం మీడియా సమావేశంలో వెల్లడించారు. 15న పందిరి పూజ, 16న పరపూజ, ఎదురుకోలు, ఉంటాయని తెలిపారు.

14న బలిజల ఆత్మీయసమావేశం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 11: మదనపల్లెలో ఈనెల 14న నిర్వహించనున్న బలిజల ఆత్మీయసమావేశానికి హాజరు కావాల్సిందిగా కాపునాడు నాయకులు మదనపల్లె నియోజకవర్గంలో పలువురిని అహ్వానిస్తున్నారు. గురువారం బలిజ సేవా సమితి అధ్యక్షుడు బీవీఎల్ విజయ్‌కుమార్‌ను కలసిన కె.అంజనేయ కుమార్, టౌన్‌బ్యాంకు వైస్‌చైర్మన్ మహర్షి భాస్కర్ తదితరులు సమావేశానికి రావాల్సిందిగా అహ్వానించారు. అలాగే కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతిని కలసి బలిజ ఆత్మీయ సమావేశాన్ని విజయవతం చేయాలని కోరారు. దీంతో పాటు బలిజ జేఏసీ అధ్యక్షుడు రిటైర్డ్ ప్రొఫెసర్ వైఎస్ మునిరత్నమయ్యను కలసిన కాపునాడు నాయకులు ఆత్మీయ సమావేశానికి అహ్వానించారు. బలిజలందరు ఏకతాటిపై నిలబడి సమస్యలు చర్చించుకోవడంతో పాటు రాబోయే ఎన్నికల్లో తీసుకోవాల్సిన నిర్ణయాలను ఈ సమావేశంలో చర్చిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బోర్‌వెల్ నాగరాజు, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, రెడ్డెప్ప పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

- నిందితుడు అరెస్టు

ములకలచెరువు, ఏప్రిల్ 11: ములకలచెరువు మండలంలో గురువారం దాడులు నిర్వహించి భారీగా కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. చౌడసముద్రం పంచాయతీ గుత్తావారిపల్లెలో రెండు సంచుల్లో ఉన్న కర్ణాటక మద్యం ప్యాకెట్లు పట్టుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బుక్కేకృష్ణానాయక్(47)ను అరెస్టు చేసి 280 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.14,647 ఉంటుందని పేర్కొన్నారు.

అక్రమార్జనతో ఓట్ల కొనుగోలుకు వక్ర మార్గాలు

● వైసీపీ కుయుక్తులపై కిశోర్‌కుమార్ రెడ్డి ఘాటు విమర్శలు



నగరిపల్లెలో మీడియాతో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, ఏప్రిల్ 11: వివిధ రకాల అక్రమాలతో కేవలం నియోజకవర్గంలోనే కోట్ల రూపాయలు కొల్లగొట్టిన అధికార పార్టీ నాయకులు రాబోయే ఎన్నికల్లో ఓట్ల కొనుగోలుకు అడ్డదారులు వెతుకుతున్నారని పీలేరు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. ఐదేళ్ళపాటు ఒక్క బాహుదా నది నుంచే రూ.వేల కోట్ల విలువచేసే లక్షల టన్నుల ఇసుకను పక్క రాష్ట్రాలకు తరలించారని ఆరోపించారు. గురువారం టీడీపీ నాయకులు పీలేరు ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ రఘురామి రెడ్డి, కలికిరి సర్పంచు ప్రతాప్‌కుమార్ రెడ్డి, చంద్రశేఖర్, కేవీ రెడ్డి, సత్యారెడ్డి తదితరులతో కలిసి కిశోర్‌కుమార్ రెడ్డి నగరిపల్లెలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నిరంకుశ పాలనపట్ల విసిగిపోయిన ప్రజలను బుజ్జగించడానికి అన్ని దారులు మూసుకుపోవడంతో, ఉన్నదల్లా డబ్బు వెదజల్లి ఓట్లు కొనుగోలు చేయడమొక్కటే మార్గమనే నిర్ణయానికి వచ్చారని ఆయన విమర్శించారు. బాహుదా నదిని చెరబట్టి ఇసుక రూపంలో ప్రకృతి ప్రసాదించిన సంపదను బాహాటంగా దోచుకున్నారని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో వందల ఎక రాల ప్రభుత్వ భూములను ఆక్రమించి యథేచ్ఛగా వెంచర్లు వేసి అమ్ముకు న్నారని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్ల స్థలాలుగా అందజేస్తామని కిశోర్‌కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. తన అన్న కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు దాదాపు 50 ఏళ్ళకు సరిప డా అభివృద్ధి చేశామని, ఆ తరువాత ఈ ఐదేళ్లలో నియోజకవర్గానికి వారు చేసిందేమిటో ప్రజలకు చెప్పాలని డిమాండు చేశారు. తిరుపతి ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల తరహాల్లో దౌర్జన్యాలు, అక్రమాలతో ఎన్నికలు జరపేందుకు అధికా ర పార్టీ చేయాలనుకున్న ప్రయత్నాలకు అడ్డుకట్ట పడిందని ఇక ఎన్నికల్లో ఓటర్లకు డబ్బు ఎర చూపి గెలుపొందాలని కుయుక్తులు పన్నుతున్నారని కిశోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఓటర్లు విజ్ఞతతో అప్రమత్తంగా వుండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగిస్తారనే భయంతోనే వారితో బలవంతంగా రాజీనామాలు చేయి స్తున్నారని విమర్శించారు.

ఇంటివద్దే పింఛన్లు పంపిణీ చేయాలి

వయోవృద్ధులకు ఇస్తున్న పింఛన్లను ఇంటి వద్దే పంపిణీ చేయాలని కిశోర్‌కుమార్ రెడ్డి డిమాండు చేశారు. వలంటీర్ల ద్వారా గతంలో ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేస్తున్నప్పుడు టీడీపీ ఎప్పుడూ అడ్డు చెప్పలేదని గుర్తు చేశారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇళ్ళ వద్దే పంపిణీ చేయించాలని తాము మొత్తుకుంటున్నా ఒకే చోట పంపిణీ చేయడం దారుణమని విమర్శించారు. మండుటెండల్లో వయసు మళ్ళిన వారిని ఇలా తిప్పుకొని వారి ప్రాణాలను హరించడం ప్రభుత్వ పాశవిక విధానాలకు నిదర్శనమని చెప్పారు. మే నెలలో పింఛన్లను ఇళ్ల వద్దే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు గ్యారంటీలు.. ప్రజలకు సంక్షేమ వారంటీలు

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ గ్యారెంటీ పథకాలు ప్రజల సంక్షేమానికి వారెంటీల్లాంటివని కిశోర్‌కుమార్ రెడ్డి ప్రశంసించారు. మహిళలందరికీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వరం లాంటిదన్నారు. ప్రతి గృహిణికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లతో దీపం పథకం మళ్ళీ వస్తోందని బడికి వెళ్ళే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు, ప్రతి మహిళకు నెల నెలా రూ.1500లు, అన్నదాతలకు ఏడాదికి రూ.20 వేల వంటి పథకాలు తిరుగులేనివన్నారు. బీసీల కోసం ప్రకటించిన పథకాలు ఆ వర్గాలకు చేయూతనిస్తాయని హామీ ఇచ్చారు. 50 ఏళ్ళ బీసీలకు నెలకు రూ.4 వేల పింఛను, పెళ్ళికానుక పేరుతో రూ. లక్ష మంజూరు, చంద్రన్న బీమా పరిహారం రూ.10 లక్షలకు పెంపుతోపాటు బీసీలకు శాశ్వత కుల పత్రాలు, రూ.1.50 లక్షల కోట్లతో బీసీ సబ్ ప్లాను, చట్ట సభల్లో, స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్ల హామీలు బీసీలకు వెన్నుదన్నుగా నిలబడగలవని కిశోర్‌కుమార్ రెడ్డి విశదీకరించారు.